సాక్షి
పశ్చిమగోదావరి
బుధవారం । 13 । డిసెంబర్ । 2023



'మొగదిండి' ప్రక్షాళన ప్రారంభం

మొగదిండి డ్రెయిన్ ప్రక్షాళన పనులను సోమవారం చేపట్టారు. కిక్కిస, గుర్రపుడెక్కతో నిండిన డ్రెయిన్‌ను ప్రత్యేక యంత్రాల సహాయంతో తొలగిస్తున్నారు. IIలో ▸



'ఆపిల్' నిర్వాకంపై ఆరా

ఆరోగ్యశ్రీ రోగుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్లు 'సాక్షి'లో ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. తణుకులోని నెట్‌వర్క్ ఆస్పత్రులను తనిఖీ చేశారు. IIలో ▸



గంజాయిపై ఉక్కుపాదం

పశ్చిమలో గంజాయి విక్రయాలపై ఉక్కుపాదం మోపుతున్నామని డీఐజీ అశోక్‌కుమార్ అన్నారు. పాలకొల్లు పట్టణ, రూరల్ పోలీస్‌స్టేషన్‌లను పరిశీలించారు. IIలో ▸

తుపాను నష్టం లెక్కింపు


- క్షేత్ర స్థాయిలోకి యంత్రాంగం
- గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో కమిటీలు
- 18వ తేదీ వరకు లెక్కింపు.. 22న ఆర్‌బీకేల వద్ద ప్రచురణ
- 26న కలెక్టర్ కార్యాలయానికి తుది జాబితా
- ప్రాథమిక అంచనా మేరకు 30,092 ఎకరాల్లో నీట మునక



ఆకివీడు మండలం చెరుకుమిల్లిలో పంట నష్టం సర్వే పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ జేడీ వెంకటేశ్వరరావు

సాక్షి, భీమవరం: మిచాంగ్ విపత్తుతో దెబ్బతిన్న రైతులను ఇన్‌పుట్ సబ్సిడీ, బీమాతో గట్టెక్కించే పనిలో ప్రభుత్వం నిమగ్నమైంది. పక్కాగా లెక్క తేల్చేందుకు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో ఏర్పాటుచేసిన ప్రత్యేక కమిటీలు క్షేత్రస్థాయిలో పని ప్రారంభించాయి. పొలాల్లోకి వెళ్లి పంట నష్టం లెక్కిస్తున్నాయి. ఫీల్డ్ సర్వే, పబ్లికేషన్, సోషల్ ఆడిట్ అనంతరం 26న తుది జాబితా కలెక్టర్ కార్యాలయానికి చేరనుంది. తొలకరి చివరి దశలో ఈ నెల మొదటి వారంలో వచ్చిన తుపాను తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. 3 నుంచి 6వ తేదీ వరకు మూడు రోజుల పాటు కురిసిన భారీ వర్షాలతో రికార్డుస్థాయిలో జిల్లాలో 258 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. గతంలో ఎన్నడూ లేని విధంగా తీర్రప్రాంత సమీప నరసాపురం, పాలకొల్లు, వీరవాసరం, ఆకివీడి తదితర మండలాల్లో సుడిగాలులు చుట్టేశాయి. జిల్లాలో ప్రధానమైన యనమదుర్రు, నక్కల డ్రెన్‌లు, ఎర్రకాలువలకు ఎగువ ప్రాంతాల నుంచి వరద పోటెత్తడంతో రోజుల తరబడి వేలాది ఎకరాల్లోని ముంపునీరు లాగడం కష్టమైంది. ప్రభుత్వ ఆదేశాలతో ముందుగానే అప్రమత్తమైన అధికారయంత్రాంగం వర్షాలకు ముందే ఆఫ్‌లైన్‌లో కళ్లాల్లోని ధాన్యాన్ని మిల్లులకు చేర్చారు. పొలాల్లో ముంపునీరు లాగేందుకు జేసీబీలు, ఉపాధి కూలీలతో యుద్ధ ప్రాతిపదికన పలు డ్రెయిన్లు, పంట బోదెల్లో పూడిక తొలగించారు. జిల్లాలో 2.13 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ సాగుచేయగా వర్షాలకు ముందే దాదాపు 95 వేల ఎకరాల్లో వరికోతలు పూర్తయ్యాయి. మిగిలిన మేర 30,092 ఎకరాల్లో పంట నీట మునిగిపోగా, 47,247 ఎకరాల్లో నేలనంటినట్టు వ్యవసాయశాఖ ప్రాథమికంగా అంచనా వేస్తూ ప్రభుత్వానికి నివేదించింది. ఉద్యానశాఖ లెక్కలు ప్రకారం పాలకొల్లు, ఆచంట, నరసాపురం, పెనుగొండ, తాడేపల్లిగూడెం తదితర మండలాల్లోని 300 ఎకరాల్లోని కూరగాయల పంటలు, 63 ఎకరాల్లోని అరటి తోటలు, 260 ఎకరాల్లోని కొబ్బరిచెట్లకు, ఐదు ఎకరాల్లోని పూలతోటలకు నష్టం వాటిల్లింది.

పక్కాగా లెక్కింపు



తుపానుతో నష్టపోయిన రైతులను ఆదుకునే దిశగా జిల్లాలో పంటనష్టం లెక్కించేందుకు చర్యలు చేపట్టాం. గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేశాం. వీరంతా క్షేత్రస్థాయిలోకి వెళ్లి పారదర్శకంగా పంట నష్టం వివరాలను నమోదు చేస్తారు. సర్వే, అభ్యంతరాల స్వీకరణ అనంతరం తుది నివేదికను ప్రభుత్వానికి నివేదిస్తాం.

ఎస్.రామ సుందర్‌రెడ్డి, జేసీ, పశ్చిమగోదావరి జిల్లా

పంటనష్టం నమోదు

విపత్తులతో పంట నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు వైఎస్సార్ ప్రభుత్వం నెల రోజుల్లోపే హెక్టారుకు రూ.17,000 చొప్పున ఇన్‌పుట్ సబ్సిడీ అందిస్తున్న విషయం విదితమే. ఒక రైతుకు గరిష్టంగా ఐదు ఎకరాల వరకు సబ్సిడీ సాయం అందుతుంది. 33 శాతం పైబడి వరిపంటకు నష్టం వాటిల్లితే పూర్తి నష్టంగా పరిగణలోకి తీసుకుంటారు. ప్రస్తుత తుపానుతో నష్టపోయిన రైతులకు సాయం అందించేందుకు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో కమిటీలు ఏర్పాటుచేసి సర్వేకు ఆదేశాలిచ్చింది. గ్రామ కమిటీలో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్, వీఆర్‌ఓ, ఈఓ, ఉద్యానశాఖకు సంబంధించి ఈఓ, వీఆర్‌ఓలతో పాటు విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్ (వీహెచ్‌ఏ) సభ్యులుగా ఉన్నారు. మండల కమిటీలో తహసీల్దార్, ఎంపీడీఓ, మండల వ్యవసాయాధికారి, డివిజన్ స్థాయిలో ఆర్‌డీఓ, ఏడీఏలు సభ్యులుగా పంట నష్టం లెక్కిస్తున్నారు. జిల్లా వ్యవసాయాధికారి జెడ్.వెంకటేశ్వరరావు, ఉద్యానశాఖ అధికారి ఎ.దుర్గేష్‌లు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ సర్వే నిర్వహణను పరిశీలిస్తున్నారు. ఈనెల 18వ తేదీ వరకు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో పక్కాగా లెక్కించనున్నారు. పారదర్శకత కోసం గ్రామ కమిటీలు ఇచ్చిన నివేదికను మండల స్థాయిలోను, మండల కమిటీలు ఇచ్చిన నివేదికను డివిజన్‌లోను పరిశీలిస్తారు. 22 నాటికి రైతులందరికి తెలిసేలా ఆర్‌బీకేల వద్ద నష్టం వివరాలు ప్రచురిస్తారు. రైతుల నుంచి ఏమైనా అభ్యంతరాలు వస్తే వివరాలు నమోదు చేసుకుంటారు. తుది నివేదికను 26వ తేదీన కలెక్టర్ కార్యాలయంలో అందజేస్తారు.

19న భీమవరానికి సీఎం జగన్



ఏర్పాట్లు పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

భీమవరం(ప్రకాశంచౌక్): ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఈనెల 19న భీమవరం పర్యటించే అవకాశం ఉన్నందున ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ మంగళవారం ఏర్పాట్లు పరిశీలించారు. వాస్తవానికి ఈ నెల 12న ముఖ్యమంత్రి పర్యటన ఖరారైంది. భారీ వర్షాల నేపథ్యంలో సభ నిర్వహించే ప్రాంతం అనుకూలంగా లేకపోవడంతో పర్యటన రద్దయింది. పర్యటన ఈ నెల 19న జరిగే అవకాశముంది. ఇదే వేదిక పైనుంచి జగనన్న విద్యా దీవెన నిధులను ముఖ్యమంత్రి విడుదల చేయనున్నారు.

ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్ల పరిశీలన

ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లు వేగవంతం చేయాలని జాయింటు కలెక్టరు ఎస్.రామసుందర్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి భీమవరం పర్యటన నేపథ్యంలో మంగళవారం స్థానిక బైపాస్ రోడ్‌లోని గ్రంధి వెంకటేశ్వరరావు ప్రభుత్వ జూనియర్ కాలేజీ వెనుక లేఅవుట్‌లో సభావేదిక, పురపాలక సంఘం పక్కన లూథరన్ హైస్కూలు గ్రౌండులో హెలిప్యాడ్‌ను జాయింటు కలెక్టరు పరిశీలించారు. జాయింటు కలెక్టరు మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. సభావేదిక, హెలిప్యాడ్ స్థలాల్లో ఇంకా మిగిలి ఉన్న వర్షపు నీటిని తొడించి, నేల చదును చేయాలన్నారు.

న్యూస్‌రీల్

క్షీరారామంలో ముగిసిన పూజలు



బ్రాహ్మణులకు తాంబూలాలు సమర్పించి పూజలకు స్వస్తి పలుకుతున్న భక్తులు

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో కార్తీక మాసం పూజలు ముగిశాయి. మంగళవారం ఉదయం కార్తీకమాసం నెలరోజులు మహాన్యాసపూర్వక అభిషేకాలు చేయించుకున్న భక్తులు స్వయంపాక దానాలతో స్వస్తి పలికారు. పురోహితులకు తాంబూళాలు ఇచ్చి ఆశీర్వచనాలు పొందారు. కార్తీకమాసం చివరిరోజు కావడంతో పట్టణ పరిసర గ్రామాల నుంచి భక్తులు అధికంగా తరలివచ్చారు. పూజా కార్యక్రమాల్లో భాగంగా స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ చైర్మన్ కోరాడ శ్రీనివాసు, ఈవో యాళ్ల సూర్యనారాయణ, ట్రస్ట్‌బోర్డు సభ్యులు నెల రోజులు స్వామివారికి పూజలు, దర్శనాలు చేసుకోవడానికి వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు సమకూర్చడంతో ఏర్పాట్లపై ఆనందం వ్యక్తంచేశారు.

పోలింగ్ కేంద్రాల వద్ద సౌకర్యాలు కల్పించాలి



మాట్లాడుతున్న ఆర్డీవో కే చెన్నయ్య

తాడేపల్లిగూడెం రూరల్: పోలింగ్ కేంద్రాల వద్ద విద్యుత్, మంచినీరు వంటి కనీస సౌకర్యాలు కల్పించాలని తాడేపల్లిగూడెం ఆర్డీవో కే చెన్నయ్య అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎన్నికల సెక్టార్ అధికారులు, పోలీస్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో చెన్నయ్య మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల వద్ద దివ్యాంగులు ఓటు వేసేందుకు వీలుగా ర్యాంపులు, వీల్‌చైర్స్‌ను అందుబాటులో ఉంచాలన్నారు. సున్నితమైన, అత్యంత సున్నితమైన గ్రామాల వివరాలను సేకరించాలని పోలీస్ సిబ్బందికి ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల స్థితిగతులను ఫార్మాట్‌లో తయారు చేసి, తనకు అందించాలన్నారు. సమావేశంలో ఏడీఏ పి.మురళీకృష్ణ, ఎంఈవో-2 పీఎంకే. జ్యోతి, హౌసింగ్ డీఈ కేవీవీఎస్.ప్రసాద్, ఏఈ వైవీ.వెంకట్రావు, మున్సిపల్ ఎంఈ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కమిటీల్లో చోటు

ఏలూరు టౌన్: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర మహిళా విభాగం నూతన కమిటీని నియమించారు. రాష్ట్ర మహిళా విభాగంలో ఏలూరు జిల్లాకు చెందిన కూసంపూడి కనక దుర్గారాణి సెక్రటరీగా, ఉన్నమట్ల ఝాన్సీని జాయింట్ సెక్రటరీగా నియమించారు. రాష్ట్ర యువజన విభాగం నూతన కమిటీలో ఏలూరు జిల్లాకు చెందిన కందుల దినేష్ రెడ్డిని జనరల్ సెక్రటరీగా, కోటగిరి సందీప్‌ను సెక్రటరీగా, సంకా నాగేషును జాయింట్ సెక్రటరీగా నియమించారు. మహిళా విభాగంలో పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన దాసరి వరలక్ష్మి, మద్దా చంద్రకళను సెక్రటరీలుగా, సోమరాజు దుర్గాభవాని, కర్రా జయ సరితను జాయింట్ సెక్రటరీలుగా నియమించారు. యువజన విభాగం కమిటీలో పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన కొవ్వూరు వేణుమాధవ్‌రెడ్డిని సెక్రటరీగా, నామన మహేష్‌ను జాయింట్ సెక్రటరీగా నియమిస్తూ కేంద్ర పార్టీ కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది.

ఈ-క్రాప్‌లోనే బీమా చెల్లింపు

ఆకివీడు: ఈ-క్రాప్ నమోదు ప్రక్రియతోనే పంటల బీమాకు ప్రీమియం చెల్లింపు జరుగుతుందని వ్యవసాయ శాఖ జేడీ జెడ్.వెంకటేశ్వర్లు చెప్పారు. మండలంలోని చెరుకుమిల్లి, చినకాపవరం, ఆకివీడు తదితర ప్రాంతాల్లో నీట మునిగిన వరి చేలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ తుపాను ప్రభావానికి నష్టపోయిన ప్రాంతాల్లో ఎన్యూమరేషన్ ప్రారంభిస్తున్నామని చెప్పారు. ఈ క్రాప్ నమోదయిన రైతులకు పంట నమోదుతో పాటు బీమా చెల్లింపు విషయాన్ని తెలియజేసే రసీదు అందజేస్తున్నామని చెప్పారు. బీమా కోసం ప్రభుత్వం ప్రీమియం చెల్లిస్తుందని జేడీ చెప్పారు. గ్రామ, మండల టీంలు ఆయా ప్రాంతాల్లో పర్యటించి నష్టం అంచనా వేస్తాయన్నారు. గ్రామంలోని నాలుగు ప్రాంతాల్లో పంట కోత ప్రయోగం నిర్వహిస్తారని చెప్పారు. ఈ నెల 22లోపు నష్టపోయిన రైతుల వివరాల్ని ఆయా ఆర్బీకేల వద్ద ఉంచుతారని చెప్పారు. 26 లోపు పంట నష్టపరిహారంపై ప్రభుత్వానికి వివరాలిస్తామన్నారు.

సత్వర నష్ట పరిహారం



ఆచంట పెదపేటలో నష్టపరిహారం చెక్కును అందిస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

పెనుగొండ: తుపాన్‌తో ఇళ్లు దెబ్బతిన్న వారికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సత్వర నష్ట పరిహారం అందిస్తున్నారని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. తుపానుతో తాటాకిల్లు పూర్తిగా ధ్వంసమైన ఆచంట పెదపేటకు చెందిన మట్టా శాస్త్రికి రూ.10వేలు చెక్కును మంగళవారం తూర్పుపాలెంలో అందజేశారు. వీటితో పాటు నిత్యావసరాలు అందించారు. గతంలో నష్టపరిహారం రావడానికి రోజులు తరబడి వేచి ఉండాల్సి వచ్చేదన్నారు. నేడు ఆ పరిస్థితి లేదన్నారు. సీఎం జగన్ పాలనలో సత్వరం పరిహారం అందిస్తున్నారన్నారు. రైతులకు త్వరలోనే నష్ట పరిహారం అందించడానికి ఇప్పటికే అంచనాలు ప్రారంభించారన్నారు. కార్యక్రమంలో పోడూరు జెడ్పీటీసీ గుంటూరి పెద్దిరాజు, మాజీ ఎంపీపీ మట్టా ఆనంద్‌కుమార్, గ్రామాధ్యక్షుడు పెచ్చెట్టి సత్యనారాయణ, కోట వెంకటేశ్వరరావులు పాల్గొన్నారు.

పథకాల ప్రచారానికే వికసిత్ భారత్ యాత్ర

- కేంద్ర, రాష్ట్ర విభాగాల భాగస్వామ్యంతో ప్రచారం
- గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్



గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా ఆదర్శ రైతు పురస్కారం అందుకుంటున్న చల్లా సత్యనారాయణ గౌడ్, చిత్రంలో ఎమ్మెల్యే కొఠారు, కలెక్టర్ తదితరులు



గాలాయగూడెంలో వికసిత్ భారత్ యాత్రను ప్రారంభిస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్, చిత్రంలో ఎమ్మెల్యే కొఠారు, జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ తదితరులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట)/దెందులూరు: భారత ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల ప్రయోజనాలను అర్హులందరికి అందజేయడంతోపాటు ఆయా పథకాల అమల్లో సంతృప్త స్థాయిని సాధించడమే వికసిత్ భారత్ సంకల్పయాత్ర లక్ష్యమని గవర్నరు ఎస్.అబ్దుల్ నజీర్ అన్నారు. మంగళవారం దెందులూరు నియోజకవర్గం గాలాయగూడెంలో నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని గవర్నర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చెప్పినట్లుగా ప్రభుత్వం పౌరుల అవసరాలను గుర్తించాలి, వారికి వారి హక్కులను ఇవ్వాలి ఇది సహజ న్యాయం, సామాజిక న్యాయం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పథకాల లబ్ధిదారులతో వారి అభిప్రాయాలు, అనుభవాలు తెలుసుకుని ఇతరులకు అవగాహన కల్పించవచ్చన్నారు. ఆయుష్మాన్ భారత్ యోజనలో కుటుంబానికి రూ.5 లక్షల ఉచిత ఆరోగ్య సంరక్షణ, పీఎం ఆవాస్ యోజనలో గృహనిర్మాణ పథకం, జల్ జీవన్ మిషన్‌లో సురక్షితమైన తాగునీరు, పీఎం కిసాన్ సమ్మాన్ ద్వారా రైతులకు స్వల్పకాలిక రుణ సదుపాయం కల్పిస్తున్నట్లు తెలిపారు. పీఎం పోషణ్ అభియాన్ ద్వారా పాఠశాల విద్యార్థులకు పౌష్టికాహారం, దీన్ దయాళ్ అంత్యోదయ యోజన, జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్ కింద పేదరిక నిర్మూలన, పీఎం ఉజ్వల యోజన ద్వారా పేద కుటుంబాలకు చెందిన మహిళలకు ఉచిత ఎల్పీజీ కనెక్షన్లు, పీఎం గరీబ్ కల్యాణ్ అన్న యోజన ద్వారా లబ్ధిదారులకు నెలకు 5 కిలోల ఉచిత ఆహార ధాన్యాలను, జన ఔషధి పరియోజన ద్వారా జనరిక్ మందులు తక్కువ ధరకు అందించడం చేస్తున్నామన్నారు.

అభివృద్ధి పథంలో నిలబెట్టిన మోదీ: కొఠారు

ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి మాట్లాడుతూ ప్రపంచంలోనే 5వ పెద్ద ఆర్థిక శక్తిగా భారత దేశాన్ని తీర్చిదిద్దిన ప్రధానమంత్రి దేశాన్ని అభివృద్ధి పథంలో నిలుపుతారన్నారు. పేదలకు నాణ్యమైన విద్య, వైద్యం అందించడం ద్వారా పేదల జీవన స్థితిగతులను మార్చేందుకు ప్రధానమంత్రి, రాష్ట్ర ముఖ్యమంత్రి ఒకే రకమైన ఆలోచనా సరళితో కృషి చేస్తున్నారన్నారు. మారుమూల పల్లెల్లో పాఠశాలలను నాడు నేడు ద్వారా అభివృద్ధి చేస్తున్నారన్నారు. దెందులూరు నియోజకవర్గంలో 200 ప్రభుత్వ పాఠశాలలను నాడు-నేడు పథకం ద్వారా కార్పొరేట్ స్థాయికి చేర్చామన్నారు. 17 వేల మంది పేదలకు సొంత ఇళ్లు మంజూరు చేశామని, వాటిలో 8 వేల గృహాలు పూర్తయ్యాయన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రతి గ్రామంలోనూ రైతు భరోసా కేంద్రం, హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేసి ప్రభుత్వ సేవలను ప్రజల వద్దకు చేర్చారన్నారు. కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ కార్యక్రమాలపై 5 ప్రచార వాహనాల ద్వారా ప్రచారం నిర్వహిస్తున్నట్లు స్పష్టం చేశారు. జెడ్పీ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా రోడ్లు, డ్రైన్లు వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలు అమలు చేస్తుందన్నారు. గృహ నిర్మాణ శాఖ స్పెషల్ సెక్రటరీ మహ్మద్ దివాన్ మైదీన్, జాయింట్ కలెక్టర్ బీ.లావణ్యవేణి, ఎస్పీ డీ. మేరీ ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధికి చేయూత

- నాలుగున్నరేళ్లలో మహిళలకు రూ.11,336.58 కోట్ల అందజేత
- ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో రికార్డు స్థాయిలో రుణాలు



జగనన్న తోడులో కూరగాయల వ్యాపారం నిర్వహిస్తున్న ఉంగుటూరు మండలం కైకరానికి చెందిన వెంకటలక్ష్మి

ఏలూరు (టూటౌన్): మహిళల స్వయం సమృద్ధికి, ఆర్థిక పరిపుష్టికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున బ్యాంకుల ద్వారా రుణాలు అందజేస్తూ వారి ఎదుగుదలకు అండగా నిలబడి ఊతం ఇస్తుంది. రాష్ట్రంలో మహిళా సాధికారతే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పెద్ద ఎత్తున మహిళలకు అండగా నిలుస్తోంది. డ్వాక్రా సంఘాలకు పెద్ద ఎత్తున బ్యాంకు లింకేజీ రుణాలు అందిస్తున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సాయంతో ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల పరిధిలో డ్వాక్రా మహిళలు తమ స్వయం ఉపాధికి బాటలు వేసుకుంటున్నారు. చిరు వ్యాపారాలు, డెయిరీ యూనిట్లు, గొర్రెలు, మేకలు, కోళ్ళ పెంపకం, కుటీర పరిశ్రమల నిర్వహణ వంటివి చేపడుతున్నారు. మరోపక్క బ్యాంకు రుణాల చెల్లింపుల్లోనూ డ్వాక్రా మహిళలు ముందంటున్నారు. డ్వాక్రా సంఘాలకు సీనియారిటీని బట్టి ఎలాంటి హామీలు లేకుండా రూ.20 లక్షల వరకూ బ్యాంకులు రుణాలుగా అందజేస్తున్నాయి. డ్వాక్రా సంఘాలకు బ్యాంకు రుణాలు అందించే విషయంలో ఎప్పటికప్పుడు ప్రభుత్వం, అధికారులు పర్యవేక్షిస్తుండటంతో మహిళలకు పెద్ద ఎత్తున రుణాలు అందించేందుకు దోహదపడుతుందని సంబంధిత అధికారులు, సిబ్బంది చెబుతున్నారు.

నాలుగున్నరేళ్లలో రూ.11,336 కోట్లకు పైగా రుణాలు

గత నాలుగున్నరేళ్లల్లో ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల పరిధిలో రూ.11,336.58 కోట్లకు పైగా బ్యాంకు రుణాలను డ్వాక్రా మహిళలకు అందించారు. ఏలూరు జిల్లాలో 1,32,707 గ్రూపులకు సంబంధించి ఇంతవరకూ రూ.6,428.88 కోట్లు, పశ్చిమగోదావరి జిల్లాలో 99,393 గ్రూపులకు ఇంతవరకూ 4,907.70 కోట్లు రుణాలుగా మంజూరు చేశారు. ప్రభుత్వం మహిళల స్వయం సమృద్ధికి ఏ స్థాయిలో పనిచేస్తుందో ఈ గణాంకాలు తెలియజేస్తున్నాయి.

జిల్లాల వారీగా బ్యాంకు రుణాలు

ఏలూరు జిల్లాలో

సంవత్సరం	గ్రూపుల సంఖ్య	రుణాల మొత్తం (రూ.కోట్లలో)
2019-20	27,103	944.96
2020-21	30,917	909.35
2021-22	29,727	1,586.11
2022-23	24,845	1,460.44
2023-24 (ఇంతవరకూ)	20,115	1,529.02

పశ్చిమగోదావరి జిల్లాలో

సంవత్సరం	గ్రూపుల సంఖ్య	రుణాల మొత్తం (రూ.కోట్లలో)
2019-20	18,922	672.15
2020-21	24,289	700.92
2021-22	22,908	1,352.53
2022-23	18,566	1,225.88
2023-24 (ఇంతవరకూ)	14,718	956.22

ఏటా లక్ష్యానికి మించి రుణాలు



ఏలూరు జిల్లా పరిధిలో డ్వాక్రా సంఘాలకు ఏటా నిర్దేశించుకున్న లక్ష్యాలకు మించి బ్యాంకుల ద్వారా రుణాలు అందజేస్తున్నాం. క్షేత్ర స్థాయిలో ఎదురవుతున్న చిన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ డ్వాక్రా సంఘాలకు మెరుగైన సహకారం అందించేందుకు కృషి చేస్తున్నాం. సగటున ఏటా 135 శాతం మేరకు మహిళలకు డ్వాక్రా రుణాలు అందిస్తున్నాం.

– ఆర్.విజయరాజు, పీడీ, డీఆర్‌డీఏ, ఏలూరు జిల్లా

చెల్లింపులు బాగున్నాయి



పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా డ్వాక్రా మహిళలు తీసుకున్న బ్యాంకు రుణాల చెల్లింపుల ప్రక్రియ బాగుంది. దీంతో క్షేత్ర స్థాయిలో మహిళలకు రుణాలు ఇచ్చే విషయంలో బ్యాంకుల సహకారం బాగుంది. గత నాలుగున్నరేళ్లుగా డ్వాక్రా సంఘాలకు రుణాలు అందించే కార్యక్రమం పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నాం. ఏటా 155 శాతం బ్యాంకు రుణాలు అందించగలుగుతున్నాం.

– ఎంఎస్ఎస్ వేణుగోపాల్, పీడీ, డీఆర్‌డీఏ, పశ్చిమగోదావరి జిల్లా

ఐకమత్యంతో ముందుకు సాగాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి చెల్లుబోయిన వేణుగోపాల కృష్ణ

నరసాపురం: ప్రతి ఒక్కరూ ఐకమత్యంతో ముందుకు సాగాలని రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాల కృష్ణ సూచించారు. మంగళవారం పట్టణంలోని 22వవార్డులో పట్టణ పరిధిలోని సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, మున్సిపల్ ఉద్యోగులు ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసుకున్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి చెల్లుబోయిన మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను, వలంటీర్ వ్యవస్థను ఉన్నత లక్ష్యంతో ఏర్పాటు చేశారన్నారు. ఇలా సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు కలిసి కార్తీక వన సమారాధన చేసుకోవడం మంచి పరిణామమన్నారు. ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలని చెప్పారు. ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు మాట్లాడుతూ కార్తీక వన సమారాధనలు మన సంస్కృతిలో భాగమన్నారు. అందరూ ఒకచోట చేరడం ద్వారా ఐకమత్యం పెరుగుతుందని సూచించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ, మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పనుల బిల్లులు సకాలంలో చెల్లించండి



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ

ఏలూరు (మెట్రో): గ్రామాల్లో ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పనులు పూర్తి చేసిన వెంటనే రికార్డు చేసి బిల్లులు సకాలంలో చెల్లించాలని జిల్లా ప్రజా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అధికారులను ఆదేశించారు. మంగళవారం నగరంలోని జెడ్పీ కార్యాలయంలో అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులతో చైర్‌పర్సన్ సమీక్షించారు. ప్రజాధనంతో నిర్మిస్తున్న భవనాలను నాణ్యతతో నిర్మించాలన్నారు. చేసిన పనులకు బిల్లులు చెల్లింపులో జాప్యం జరుగుతోందని, బిల్లులు సకాలంలో చెల్లించేలా క్వాలిటీ కంట్రోల్ అధికారులకు తగిన ఆదేశాలివ్వాలని పీఆర్ అండ్ ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈలను ఆదేశించారు. జిల్లా పరిషత్ నుంచి మంజూరైన పనులు సకాలంలో పూర్తి చేసి వినియోగంలోకి తీసుకువచ్చేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. జెడ్పీ సీఈవో సుబ్బారావు మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధులు పీఎఫ్ఎంఎస్ ద్వారా చెల్లించాల్సిన బిల్లులను రెండు రోజుల్లో ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని, పెండింగ్ బిల్లులను తక్షణమే కార్యాలయానికి పంపాలని ఇంజినీరింగ్ అధికారులను కోరారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు గంటా ప్రసాదరావు, పంచాయతీ రాజ్ ఎస్ఈ కేదారేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఎస్వీ సత్యనారాయణ, ఈఈ రమణ మూర్తి, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

‘మొగదిండి’ ప్రక్షాళన పనులు ప్రారంభం

- 4 వేల ఎకరాలకు తప్పనున్న ముంపు ముప్పు
- నిధులు మంజూరుకు కృషి చేసిన మంత్రి కారుమూరి నాగేశ్వరరావు
- టీడీపీ నాయకుల తప్పుడు ప్రచారంపై రైతుల ధ్వజం



మొగదిండి డ్రైయిన్‌లో జేసీబీతో పూడిక తొలగిస్తున్న దృశ్యం



పూడిక తొలగించిన తరువాత మొగదిండి డ్రైయిన్‌లో ప్రవాహం

భీమవరం: మొగదిండి డ్రెయిన్ ప్రక్షాళన కోసం అధికార పార్టీ నాయకుల సహకారంతో రైతు కార్యాచరణ సమితి నిధులు మంజూరుకు కృషి చేస్తే టీడీపీ నాయకులు తమ ఘనతగా ప్రచారం చేసుకోవడాన్ని రైతులు తీవ్రంగా విమర్శిస్తున్నారు. మొగదిండి డ్రెయిన్ అభివృద్ధిని గత టీడీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో కాళ్ల మండలంలోని చినపుల్లేరు, సీసలి, కాళ్ల, బొండాడ, జక్కరం, బొండాడపేట, బొండాడలంక, మాలవానితిప్ప తదితర గ్రామాలకు చెందిన సుమారు నాలుగు వేల ఎకరాల్లో పంట భూములు నీట మునిగి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. రైతుల కష్టాన్ని గమనించిన రైతు కార్యాచరణ సమితి అధ్యక్షుడు, పశ్చిమ డెల్టా ప్రాజెక్ట్ కమిటీ మాజీ చైర్మన్ పాతపాటి మురళీరామరాజు సమస్యను ప్రభుత్వ విప్, భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్, డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు సహకారంతో రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల శాఖ మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు దృష్టికి తీసుకువెళ్లారు. రైతుల ఇబ్బందులను తెలుసుకున్న మంత్రి కారుమూరి మొగదిండి డ్రెయిన్ సమస్యను కలెక్టర్ పి.ప్రశాంతికి తెలిపి నిధులు మంజూరు చేయించారు. దీంతో డ్రెయిన్ ప్రక్షాళన పనులను మురళీరామరాజు నేతృత్వంలో సోమవారం చేపట్టారు. కిక్కిస, గుర్రపుడెక్కతో నిండిన డ్రెయిన్‌ను ప్రత్యేక యంత్రాల సహాయంతో తొలగిస్తున్నారు. సుమారు ఏడు కిలోమీటర్ల మేర డ్రెయిన్ అభివృద్ధి చేయాల్సి ఉండగా, ఇప్పటివరకు సుమారు అర కిలోమీటర మేర పనులు పూర్తి చేశారు.

అప్పుడు నిర్లక్ష్యం.. ఇప్పుడు ప్రచారం

గతంలో మొగదిండి డ్రెయిన్ మరమ్మతుల ఊసెత్తని టీడీపీ నాయకులు ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనులను తామే చేయిస్తున్నామంటూ ప్రచారం చేస్తుండటంపై రైతుల్లో విస్మయం వ్యక్తమవుతోంది. పనులు జరుగుతున్న ప్రాంతాన్ని ఉండి ఎమ్మెల్యే మంతెన రామరాజు, ఇతర టీడీపీ నాయకులు సందర్శించి ఫొటోలు దిగి పనులు తమవల్లే జరుగుతున్నాయంటూ చెబుతుండటం గమనార్హం.

మంత్రి కారుమూరి సహకారంతోనే నిధుల విడుదల



మంత్రి నాగేశ్వరరావు, ఎమ్మెల్యే శ్రీనివాస్, డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు ప్రోత్సాహం వల్లే మొగదిండి డ్రెయిన్ ప్రక్షాళనకు కలెక్టర్ ప్రశాంతి నిధులు మంజూరు చేశారు. రాజకీయాలకు అతీతంగా రైతుల సమస్యలను పరిష్కరించడానికి రైతు కార్యాచరణ సమితి కృషి చేస్తుంటే డ్రెయిన్ పనులను టీడీపీ నాయకులు చేయిస్తున్నట్లు చేస్తున్న ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నా. రైతుల సమస్యను వివరించడంతో ప్రజాప్రతినిధులు తక్షణం స్పందించి నిధులు మంజూరుకు సహకారం అందించారు. టీడీపీ నాయకులు రాజకీయం చేసి పబ్బం గడుపుకోవాలని చూడడం దారుణం. డ్రెయిన్ అభివృద్ధి పనులు ఎవరి వల్ల జరుగుతున్నాయో రైతులందరికీ తెలుసు. ఇప్పటికైనా టీడీపీ అసత్య ప్రచారాలను విరమించుకోవాలి.

– పాతపాటి మురళీరామరాజు, రైతు కార్యాచరణ సమితి అధ్యక్షుడు

అప్పుల బాధ తాళలేక దంపతుల ఆత్మహత్య



నాగబాబు, అనూష దంపతులు (ఫైల్)

ముదినేపల్లి రూరల్: అప్పుల బాధ తాళలేక దంపతులు ఆత్మహత్యకు పాల్పడ్డ విషాదకర సంఘటన మండలంలోని పెదగొన్నూరు శివారు విశ్వనాద్రిపాలెంలో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన పరసా నాగబాబు (30)కు తెలంగాణ రాష్ట్రం సూర్యాపేటకు చెందిన అనూష (25)తో 2015లో వివాహం జరిగింది. వీరికి ఆరేళ్ల కుమారుడు, ఐదేళ్ల కుమార్తె ఉన్నారు. నాగబాబు కొంతకాలంగా రొయ్యల చెరువులు సాగు చేస్తున్నాడు. సాగులో నష్టాలు రావడంతో అప్పుల పాలయ్యాడు. సాగులో కోలుకునే అవకాశం లేకపోవడం, అప్పులు తీర్చే మార్గం లేక నాగబాబు దంపతులు మంగళవారం రాత్రి విశ్వనాద్రిపాలెంలోని ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. సమాచారం అందుకున్న కైకలూరు రూరల్ సీఐ కృష్ణకుమార్, ముదినేపల్లి ఎస్సై వెంకటకుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి వివరాలపై ఆరా తీశారు. అనూష తల్లిదండ్రులు సూర్యాపేట నుంచి వచ్చిన తరువాత వారి నుంచి మరిన్ని వివరాలు తెలిసే అవకాశం ఉందని సీఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

గడపగడపకు సంక్షేమం



యలమంచిలి: లక్ష్మీపాలెంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఓ మహిళకు సంక్షేమ పథకాల బ్రోచర్ అందిస్తున్న వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి)

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి దుర్మరణం

- లారీని ఢీకొన్న ట్రక్కు ఆటో, దారితిప్ప వద్ద ఘటన
- మరో వ్యక్తికి తీవ్రగాయాలు, విజయవాడ తరలింపు



ఘటనా స్థలంలో మృతదేహాలు



దారితిప్ప వద్ద హైవేపై ప్రమాదం దృశ్యం

మొగల్తూరు: దారితిప్ప వద్ద జాతీయ రహదారిపై లారీని ఆటో ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు చిరు వ్యాపారులు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. వివరాలిలా ఉన్నాయి. తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరం మండలం వెలగదుర్రు గ్రామానికి చెందిన యల్లమిల్లి రవికుమార్ (38), పోలుమాటి శ్రీను (37), చోరపల్లి వీరబాబు ఫోన్ ద్వారా ఆర్డర్లు తీసుకుని ట్రక్ ఆటోలో మెష్‌లు వేసుకుని వెళ్లి నాటుకోళ్లకు గాబులు కడతారు. ఈ వ్యాపారం ద్వారా వచ్చే సొమ్ముతో కుటుంబాలను పోషించుకుంటున్నారు. దీనిలో భాగంగా ఆటోలో మెష్‌లు వేసుకుని బాపట్ల మండలం రేపల్లెకు బయలుదేరారు. సోమవారం అర్ధరాత్రి మొగల్తూరు మండలం దారితిప్ప గ్రామం వద్దకు వచ్చేసరికి ఆటో అదుపుతప్పి ఎదురుగా వస్తున్న కృష్ణా జిల్లా నుంచి మండపేటకు వెళుతున్న ధాన్యం లోడు లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో యల్లమిల్లి రవికుమార్, పొలమాటి శ్రీను ఘటనా స్థలంలోనే మృతి చెందగా, ఆటో నడుపుతున్న చోరపల్లి వీరబాబుకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతనిని చికిత్స నిమిత్తం ఏలూరుకు, అక్కడి నుంచి విజయవాడ తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నరసాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎస్సై ఎం.వీరబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జీవనోపాధి కోసం వెళ్లి.. మృత్యులోకాలకు..

ఉండ్రాజవరం: జీవనోపాధి కోసం బయలుదేరిన చిరు వ్యాపారులు.. అట్నుంచి అటే మృత్యులోకాలకు చేరుకున్నారు. తూర్పు గోదావరి జిల్లా ఉండ్రాజవరం మండలం వెలగదుర్రు గ్రామానికి చెందిన యల్లమిల్లి రవికుమార్ (38), పోలుమాటి శ్రీను (37), చోరపల్లి వీరబాబులు నాటుకోళ్లకు గాబులు కడుతూంటారు. బాపట్ల జిల్లా రేపల్లె మండలంలోని చుట్టుపక్కల గ్రామాల్లో గాబులు కట్టేందుకు సోమవారం ఆటోలో వెళుతూ సోమవారం అర్ధరాత్రి పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు మండలం దారితిప్ప గ్రామం వద్ద ఆటో అదుపుతప్పి లారీని ఢీకొన్న ప్రమాదంలో రవికుమార్, శ్రీను అక్కడికక్కడే మృతి చెందగా, తీవ్రంగా గాయపడిన వీరబాబు విజయవాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ సంఘటనతో మృతుల కుటుంబాల్లో విషాదఛాయలు అలముకున్నాయి. రెక్కాడితేనే కానీ డొక్కాడని ఆ కుటుంబాల్లో ఈ ప్రమాదం తీరని విషాదాన్ని నింపింది. మృతులు రవికుమార్, శ్రీను వివాహితులు, ఇద్దరికీ చెరో ఇద్దరు చొప్పున పిల్లలున్నారు. రవికుమార్, శ్రీను మృతితో కుటుంబ సభ్యులతో పాటు భార్య, పిల్లలు, బంధువులు కన్నీమున్నీరవుతున్నారు.



రవికుమార్ (ఫైల్)



పోలుమాటి శ్రీను (ఫైల్)

జాతీయ యోగా పోటీలకు హీల్ విద్యార్థినులు



విద్యార్థినులను అభినందిస్తున్న దృశ్యం

ఆగిరిపల్లి: జాతీయ స్థాయిలో నిర్వహించే యోగా చాంపియన్‌షిప్ పోటీలకు తోటపల్లిలోని హీల్ ప్యారడైజ్ పాఠశాల విద్యార్థినులు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయుడు సాయిబాబా చెప్పారు. ఈనెల 9 నుంచి 11వ తేదీ వరకు నాగార్జున విశ్వవిద్యాలయంలో జరిగిన 4వ రాష్ట్రస్థాయి యోగ అర్హత పోటీలలో విద్యార్థినులు కవిత, కాక్షాయిని సిల్వర్ మెడల్స్ సాధించి జాతీయ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. హీల్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ కోనేరు సత్యప్రసాద్, క్యాంపస్ చైర్మన్ పిన్నమనేని ధనప్రకాష్, సీఈవో కూరపాటి అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

‘ఆపిల్’ నిర్వాకంపై అధికారుల ఆరా

- మరో ఘటనలో ఆపిల్ ఆస్పత్రికి రూ.60 వేలు జరిమానా
- ఆరోగ్యశ్రీ రోగి నుంచి రూ.5 వేలు వసూలుపై నోటీసులు

సాక్షి ఎఫెక్ట్



ఆపిల్ ఆస్పత్రిలో రోగులతో మాట్లాడుతున్న ఆరోగ్యశ్రీ జిల్లా కో–ఆర్డినేటర్ డాక్టర్ కీర్తి కిరణ్

తణుకు అర్బన్: ‘ఆరోగ్యశ్రీ సేవలకు తూట్లు’ శీర్షికన ఈనెల 10వ తేదీన ‘సాక్షి’లో ప్రచురితమైన కథనంపై వైఎస్సార్ ఆరోగ్యశ్రీ అధికారులు స్పందించారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ జిల్లా కో–ఆర్డినేటర్ డాక్టర్ కీర్తికిరణ్ మంగళవారం తణుకులోని ఆరోగ్యశ్రీ సేవలున్న అన్ని నెట్‌వర్క్ ఆస్పత్రులను తనిఖీ చేశారు. ముఖ్యంగా తణుకు రైల్వేస్టేషన్ రోడ్డులోని ఆపిల్ ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ సేవలు పొందిన రోగి నుంచి రూ.5 వేలు వసూలు చేసిన ఉదంతంపై ఆరా తీశారు. దీంతోపాటు ఆస్పత్రిలోని ఆరోగ్యశ్రీ వార్డులో రోగుల వద్దకు వెళ్లి డబ్బులు ఏమైనా చెల్లించారా అని అడిగి తెలుసుకున్నారు.

ఆపిల్ ఆస్పత్రికి మరో జరిమానా

వైఎస్సార్ ఆరోగ్యశ్రీలో గత అక్టోబర్‌లో శస్త్రచికిత్స చేయించుకున్న రోగి బంధువుల నుంచి ఆపిల్ ఆస్పత్రి యాజమాన్యం రూ.6 వేలు వసూలు చేసిందని బాధితుల నుంచి 104కి అందిన ఫిర్యాదును పరిగణనలోకి తీసుకుని సోమవారం ఆస్పత్రికి రూ.60 వేలు జరిమానా విధించినట్లు డాక్టర్ కీర్తికిరణ్ చెప్పారు. అలాగే తణుకు మండలం తేతలి గ్రామానికి చెందిన ఎస్‌టీ మహాలక్ష్మి నుంచి ఈనెల 6వ తేదీన రూ.5 వేలు వసూలు చేసిన ఘటనకు సంబంధించి ఆస్పత్రి యాజమాన్యానికి నోటీసు ఇవ్వనున్నట్లు చెప్పారు.

దిగివచ్చిన ఆపిల్ యాజమాన్యం

ఆరోగ్యశ్రీ రోగి నుంచి వసూలు చేస్తున్న ఆపిల్ ఆస్పత్రి యాజమాన్యం తప్పును తెలుసుకుని దిద్దుబాటు చర్యలకు దిగింది. ఆస్పత్రికి వచ్చి రూ.5వేలు తీసుకువెళ్లాల్సిందిగా బాధితురాలికి సిబ్బందితో పదేపదే ఫోన్‌లు చేయించారు. ఆరోగ్యశ్రీ రోగి నుంచి శస్త్రచికిత్సకు ముందు మత్తు ఇచ్చేందుకు రూ.10 వేలు చెల్లించాలని అడగడం, శస్త్రచికిత్స అనంతరం షంట్ తీసేందుకు రూ.5 వేలు వసూలు చేస్తుండటంతో ఆపిల్ ఆస్పత్రి తీరుపై తణుకు ప్రజలు గుర్రుగా ఉన్నారు. జనరల్‌లో షంట్ తొలగించడం వల్లనే రూ.5 వేలు తీసుకున్నామని ఆస్పత్రి వర్గాలు చెబుతుండడం కూడా హాస్యాస్పదంగా ఉంది. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కేస్‌షీటుతో వైద్యం చేసి డబ్బులు వసూలు చేయడం ఎంతవరకు సబబని బాధితురాలు ప్రశ్నిస్తోంది. ఈ ఘటనకు సంబంధించి ఆస్పత్రి యాజమాన్యంపై ఏమేరకు చర్యలు ఉంటాయో వేచిచూడాల్సిందే.

మద్ది క్షేత్రం.. భక్తజన సంద్రం



మద్ది క్షేత్రంలో భక్తుల రద్దీ




ఎమ్మెల్యే బాలరాజును సత్కరిస్తున్న ఈవో

జంగారెడ్డిగూడెం రూరల్: కార్తీకమాసం ఆఖరి మంగళవారం గురవాయిగూడెంలోని శ్రీమద్ది ఆంజనేయస్వామి క్షేత్రం భక్తజన సంద్రమైంది. ఆలయ అర్చకులు స్వామివారికి తమలపాకులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు 108 ప్రదక్షిణలు చేసి తమ మొక్కులను తీర్చుకున్నారు. ఉసిరిచెట్ల కింద కార్తీక దీపారాధనలు చేశారు. స్వామివారిని పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈవో ఆకుల కొండలరావు ఆలయ మర్యాదలతో ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. దర్శనం అనంతరం అర్చకులు స్వామివారి శేషవస్త్రాన్ని కప్పి ప్రసాదాలను అందజేశారు. టి.నర్సాపురం జెడ్పీటీసీ సభ్యులు సామంతపూడి సూర్యనారాయణరాజు పాల్గొన్నారు.

గంజాయి విక్రయాలపై ఉక్కుపాదం

- ఏలూరు రేంజ్ డీఐజీ అశోక్ కుమార్
- పాలకొల్లు, నరసాపురం, మొగల్తూరు స్టేషన్ల తనిఖీ



పాలకొల్లులో మాట్లాడుతున్న డీఐజీ అశోక్‌కుమార్, చిత్రంలో ఎస్పీ యు.రవిప్రకాష్

పాలకొల్లు సెంట్రల్: జిల్లాలో గంజాయి విక్రయాలపై ఉక్కుపాదంతో వ్యవహరిస్తున్నామని ఏలూరు రేంజ్ డీఐజీ జీవీజీ అశోక్‌కుమార్ చెప్పారు. జిల్లాలోని పోలీస్‌స్టేషన్ల సందర్శనలో భాగంగా మంగళవారం పాలకొల్లు పట్టణ, రూరల్ స్టేషన్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఐజీ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఏలూరు రేంజ్ పరిధిలోని ఆరు జిల్లాల్లో గత ఏడాది గంజాయి కేసులు 217 నమోదు కాగా, ఈ ఏడాదిలో ఇప్పటివరకు 293 కేసులు నమోదయ్యాయన్నారు. గంజాయి అమ్మకాలు, విక్రయాలపై విస్తృత స్థాయిలో తనిఖీలు చేస్తున్నామన్నారు. అలాగే రేంజ్ పరిధిలో సైబర్ కేసుల పరిష్కారానికి ప్రతి స్టేషన్లో ఒక కానిస్టేబుల్‌ను నియమించామన్నారు. ఓటీపీ మోసాలపై ఎక్కువ కేసులు వస్తున్నాయన్నారు. అటువంటి బాధితులు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేస్తే అకౌంట్‌ను బ్లాక్ చేయించేలా చర్యలు తీసుకుని డబ్బు ట్రాన్స్‌ఫర్ కాకుండా నిలిపివేయవచ్చన్నారు. సైబర్ నేరాలపై నేరుగా స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయాలని, లేదంటే 1930 నంబర్‌కు కాల్ చేసి చెప్పవచ్చన్నారు. రేంజ్ పరిధిలో వారెంట్లు 1006 కేసులు ఉండగా, ఇందులో సుమారు 200 కేసులు చెక్ బౌన్స్ కేసులే ఉన్నాయన్నారు. అలాగే పోక్సో, మర్డర్ 3600 కేసులు నమోదు కాగా, వీటిలో 62 శాతం కేసుల్లో నిందితులకు శిక్షలు పడ్డాయన్నారు. 2,030 మంది రౌడీషీటర్లను బైండవర్ చేశామని, వీరి కదలికలపై నిఘా పెట్టామన్నారు. అనంతరం డీఐజీ పట్టణంలోని క్షీరారామలింగేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

గంజాయి కట్టడికి ప్రత్యేక చర్యలు

నరసాపురం: ఏలూరు రేంజ్ పరిధిలో గంజాయి కట్టడికి ప్రత్యేక చర్యలు తీసుకున్నామని డీఐజీ అశోక్‌కుమార్ చెప్పారు. మంగళవారం డీఐజీ నరసాపురం పట్టణ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రేంజ్ పరిధిలో గత ఏడాది 217 గంజాయి కేసులు నమోదు చేసి 700 మందిని అరెస్ట్ చేసి, 20,900 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. గంజాయి కట్టడికి ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి తీసుకున్న చర్యలు సత్ఫలితాలను ఇచ్చాయన్నారు. ఈ ఏడాదిలో ఇప్పటివరకు 293 గంజాయి కేసులు నమోదు చేసి 10,500 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నామన్నారు. గంజాయి వ్యవహారాలు 50 శాతం తగ్గాయని వివరించారు. ఎన్నికలు సమీపిస్తున్న దృష్ట్యా శాఖాపరంగా సన్నాహాలు మొదలుపెట్టామని, దీనిలో భాగంగా పెండింగ్ నాన్‌బెయిలబుల్ వారెంట్స్ క్లియర్ చేస్తున్నామని చెప్పారు. సమస్యాత్మక ప్రాంతాలపై నివేదికలు తయారు చేస్తున్నామన్నారు. పశ్చిమ గోదావరి జిల్లాలో గత ఏడాదితో పోలిస్తే నేరాలు, రోడ్డు ప్రమాదాలు కూడా తగ్గాయన్నారు. హెల్మెట్ ఆవశ్యకతపై జిల్లా పోలీసులు చేపట్టిన చర్యలు బాగున్నాయన్నారు. స్టేషన్‌లో రికార్డులు తనిఖీ చేశారు.

సైబర్ నేరాలకు 1930కి సమాచారం ఇవ్వండి

మొగల్తూరు: సైబర్ నేరాల నివారణకు 1930 టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు చేసినట్టు డీఐజీ జీవీజీ అశోక్ కుమార్ చెప్పారు. మంగళవారం రాత్రి మొగల్తూరు స్టేషన్‌ను సందర్శించి సిబ్బందికి పలు సూచనలిచ్చారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల సైబర్ నేరగాళ్ల బారిన పడి డబ్బులు పోగొట్టుకుంటున్న బాధితులు పెరిగారన్నారు. వీరి కోసం ప్రత్యేక టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేశామన్నారు. నేరం జరిగిన రెండు గంటల లోపు ఫిర్యాదు చేస్తే బాధితులకు సత్వర న్యాయం అందుతుందన్నారు. రేంజ్ పరిధిలోని ప్రతి స్టేషన్‌లో సైబర్ నేరాలకు సంబంధించి ఇద్దరు సిబ్బందికి శిక్షణ ఇచ్చామన్నారు. ఏలూరు రేంజ్ పరిధిలో పోక్సో, హత్య కేసులకు సంబంధించి సుమారు 3,600 కేసుల్లో 65 శాతం శిక్షలు పడ్డాయన్నారు. మొగల్తూరు స్టేషన్‌కు సంబంధించి మూడు మండలాలు, రెండు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో విస్తరించి ఉండటం, ఈ స్టేషన్‌లో క్రైమ్ రేటు ఎక్కువగా ఉన్న విషయాన్ని స్థానిక విలేకరులు ఆయన దృష్టికి తీసుకురాగా ఎస్పీ యు.రవి ప్రకాష్‌ను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ ఏడాదిలో ఇప్పటి వరకూ 343 కేసులు నమోదైనట్టు ఎస్ఐ ఎం.వీరబాబు చెప్పగా, మండల పరిధిలోనే స్టేషన్ పరిధి ఉండేలా కార్యచరణ రూపొందించాలని సూచించారు. డీఐజీ వెంట సీఐలు శ్రీనివాస యాదవ్, గోవిందరాజు, ఎస్సైలు వీరబాబు, గురవయ్య ఉన్నారు.

‘పంచారామదర్శిని’ ద్వారా రూ.32.82 లక్షల ఆదాయం

4 డిపోల ద్వారా 91 ప్రత్యేక సర్వీసులు

భీమవరం (ప్రకాశం చౌక్): కార్తీక మాసంలో పంచారామదర్శిని యాత్రకు ప్రత్యేక బస్సు సర్వీసులు నడపడం ద్వారా ఆర్టీసీకి రూ.32.82 లక్షల ఆదాయం లభించింది. నవంబర్ 14 తేదీ నుంచి డిసెంబర్ 11 చివరి సోమవారం వరకు అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, సామర్లకోటలోని పంచారామ క్షేత్రాలను ఒకే రోజు దర్శించుకునేలా జిల్లాలోని నాలుగు డిపోల ద్వారా ఆర్టీసీ 91 ప్రత్యేక బస్సులను నడిపింది. జిల్లాలో అత్యధికంగా భీమవరం డిపో నుంచి 25 బస్సులు నడపగా, రూ.8.68 లక్షలు, నర్సాపురం డిపో నుంచి 24 బస్సుల ద్వారా రూ.8.63 లక్షలు తాడేపల్లిగూడెం నుంచి 23 సర్వీసుల ద్వారా రూ.7.23 లక్షలు, తణుకు నుంచి 19 బస్సుల ద్వారా రూ.8.27 లక్షల ఆదాయం ఆర్టీసీకి లభించింది. ఈ యాత్రకు సాధారణ టికెట్ ధరలకే ప్రయాణం అందుబాటులోకి తీసుకురావడంపై భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పంచారామదర్శిని యాత్రకు ప్రయాణికుల నుంచి స్పందన బాగుండటంతో ముందుముందు మరిన్ని సర్వీసులను ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకువస్తామని ప్రజారవాణా అధికారి ఎం.వీరయ్యచౌదరి చెప్పారు.

క్లుప్తంగా

ఆస్పత్రుల్లో ప్రసవాలు అధికంగా జరగాలి



అత్తిలి పీహెచ్‌సీలో మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ మహేశ్వరరావు

అత్తిలి: ఆస్పత్రుల్లో ప్రసవాలు ఎక్కువగా జరిగేలా చూడాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ డి.మహేశ్వరరావు వైద్యులకు సూచించారు. మంగళవారం అత్తిలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరుగుతున్న ఆశా డే కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఎం అండ్‌హెచ్‌ఓ మల్లేశ్వరరావు మాట్లాడుతూ గర్భిణుల్లో రక్తహీనతతో బాధపడేవారు 104కు కాల్ చేసి 102 తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనం ద్వారా ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వద్దకు వెళ్లి ఐరన్, సుక్రోజ్ ఇంజెక్షన్‌లు చేయించుకోవాలని చెప్పారు. 0–5 సంవత్సరాల పిల్లలకు వచ్చే న్యుమోనియా గురించి సర్వేపై వివరాలు, క్షేత్రస్థాయిలో ఆశాలు ఎదుర్కొంటున్న సమస్యలు గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ కె.నాగరాజు, డాక్టర్ ఆర్.సురేఖ, సీహెచ్‌ఓ పి.మురళి, హెచ్‌ఈ జి.ప్రమీలాదేవి పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం



ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

తణుకు అర్బన్: సజ్జాపురం సీనియర్స్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వృద్ధులకు మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరానికి హాజరైన 40 మంది వృద్ధులకు డాక్టర్ భూపతిరాజు రమేష్‌చంద్రబాబు వైద్యసేవలందించగా, టెక్నీషియన్స్ బీపీ, సుగర్ పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందచేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు అడ్డాల సత్యనారాయణ, స్థానిక శాఖ ఉపాధ్యక్షుడు కాయల నాగేశ్వరరావు, ద్వారంపూడి బాబిరెడ్డి, కార్యదర్శులు కోసూరి గాంధీ, పెన్మెత్స సత్యనారాయణరాజు, ఇవటూరి లక్ష్మణరావు, చేబ్రోలు సాధు పాల్గొన్నారు.

క్రీస్తు బోధనలు అనుసరణీయం



దుప్పట్లు అందజేస్తున్న నాగబాబు

పెంటపాడు: ఏసు క్రీస్తు బోధనలు అనుసరణీయమని ప్రకాశం జిల్లా వేట్లపాలెంకు చెందిన దైవజనులు బ్రదర్ జేమ్సు పేర్కొన్నారు. రాచర్ల లో ఎస్సీ కమ్యూనిటీ హాల్ ప్రాంగణంలో సోమవారం రాత్రి ఐక్యక్రిస్మస్ సెలబ్రేషన్ హెల్పింగ్ హేండ్స్ సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జేమ్సు ముఖ్యఅతిథిగా పాల్గొని ఆధ్యాత్మిక సందేశం అందించారు. చిన్నారులు క్రిస్మస్ నాటికలతో అలరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నవోదయ ఫ్రెండ్స్ యూనియన్ అధ్యక్షుడు యోగ్గిన నాగబాబు వృద్ధులకు దుప్పట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెల్పింగ్ హేండ్స్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

17న మండల ఉద్యోగుల ఐక్య క్రిస్మస్ వేడుకలు

పెంటపాడు: ఈనెల 17న సాయంత్రం పెంటపాడు మండల ఉపాధ్యాయ, ఉద్యోగుల ఐక్య క్రిస్మస్ వేడుకలు వీజెం వీరన్న ఓపెన్ ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించనున్నట్లు ఆహ్వాన కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో దైవసేవకులు బ్రదర్ వి.స్టీఫె న్ దేవుని వాక్యం అందిస్తారన్నారు. ఈ సమావేశంలో ఉపాధ్యాయ,తదితరులు పాల్గొవాలన్నారు.

మెట్లపై నుంచి జారిపడి బాలికకు గాయాలు

తాడేపల్లిగూడెం రూరల్: ప్రమాదవశాత్తు మెట్లు పై నుంచి జారిపడి బాలికకు గాయాలైన సంఘటన మండలంలోని ఒక ప్రైవేట్ విద్యా సంస్థలో చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ఎనిమిదవ తరగతి విద్యార్థిని గాయపడినట్లు తెలిసింది. ఆమెను రాజమహేంద్రవరంలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించినట్లు సమాచారం. బాలికకు ప్రాణాపాయంలేదని తెలిసింది. పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

పరిమెళ్ల ఇళ్ల బాధితులకు న్యాయం చేయాలి

పెంటపాడు: మండలంలోని జగనన్న గృహబాధితులకు న్యాయం చేయాలని ఏపీ వ్యవసాయ కార్మికసంఘ నాయకులు కళింగ లక్ష్మణరావు కోరారు. ఈ సందర్భంగా బాధితుల ఆధ్వర్యంలో మంగళవారం పెంటపాడు తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏపీ వ్యవసాయ కార్మికసంఘ నాయకులు కళింగ లక్ష్మణరావు మాట్లాడుతూ పరిమెళ్ల గ్రామంలో ఇళ్లు నిర్మిస్తామని చెప్పిదారుల కాంట్రాక్టర్‌ను సొమ్ము తీసుకొని ఇళ్ల నిర్మాణం చేపట్టడం లేదన్నారు. ఈ విషయంపై లబ్ధిదారులైన గండికోట బుల్లెమ్మ, నక్కా నాగమణి, యాకోబు, తాడిపాటి శ్రీను తదితరుల ఆధ్వర్యంలో సమస్యను తహసీల్దార్ జీవీ శేషగిరిరావుకు వివరించారు.

సీఎం జగన్‌తోనే సంక్షేమం, అభివృద్ధి

ఉత్సాహంగా 'వై ఏపీ నీడ్స్ జగన్'

తణుకు అర్బన్: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ యిండుగపల్లి బలరామకృష్ణ అన్నారు. తణుకు 22వ వార్డులోని కప్పల వెంకన్న సెంటర్‌లో మంగళవారం నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశ చరిత్రలో ఏ ఒక్క రాష్ట్రంలోను లేవని అన్నారు. పక్క రాష్ట్రాలు సైతం మన మాదిరిగా సచివాలయ వ్యవస్థను ఏర్పాటుచేసే దిశగా ఆలోచిస్తుండడం జగనన్న ముందుచూపునకు నిదర్శనమన్నారు. ముఖ్యంగా ఇంటిగుమ్మంలోకే సంక్షేమ పథకాలు అమలవుతున్న తీరును ప్రజలు, లబ్ధిదారులు స్వాగతిస్తున్నారని అన్నారు. ముందుగా స్థానిక సచివాలయంలో సంక్షేమపట్టికను ఆవిష్కరించి, జెండా స్థూపం వద్ద పార్టీ జెండాను ఎగురవేశారు. అనంతరం ఇంటింటికి వెళ్లి ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే బ్రోచర్‌లను అందచేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మెహర్ అన్సారీ, నాయకులు గెద్దాడ శ్రీకాంత్, వన్నెంరెడ్డి మురళి, పుల్లెపు సూర్యచంద్రరావు, అడ్డాల రామకృష్ణ, కోన రమేష్, రేలంగి రాంబాబు, డోలా సింహాద్రి, యారబాటి రామకృష్ణ, గారపాటి సత్యనారాయణ పాల్గొన్నారు.



తణుకు అర్బన్: వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో జెండా ఆవిష్కరించిన బలరామకృష్ణ, సూర్య తదితరులు



ఇరగవరం: రేలంగిలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ పంపన అంజిబాబు

అర్హులందరికీ లబ్ధి

అత్తిలి: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ అన్నారు. మంగళవారం సాయంత్రం అత్తిలి మండలం ఉరదాళ్లపాలెంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సభలో పైబోయిన మాట్లాడుతూ దేశంలో ఏరాష్ట్రంలో అమలు చేయనటువంటి సంక్షేమ పథకాలను విజయవంతంగా అమలు చేసి, ప్రజలకు ఆర్థిక భరోసా కల్పించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని రానున్న ఎన్నికల్లో తిరిగి గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విద్యాదీవెన, విద్యాకానుక, అమ్మ ఒడి, మనబడి నాడు–నేడు వంటి పథకాలను ప్రవేశపెట్టి అందరిమన్ననలు పొందారని తెలిపారు. అమలు కాని హామీలిచ్చిన చంద్రబాబు మ్యానిఫెస్టోని సైతం వెబ్‌సైట్ నుంచి తొలగించాడని విమర్శించారు. ముందుగా పార్టీ పతాకాన్ని పైబోయిన ఎగురవేసారు. అనంతరం సచివాలయం వద్ద సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శింగంశెట్టి శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాస్, జెడ్పీ కోఆప్షన్ మెంబర్ మహ్మద్ అబీబుద్దీన్, జిల్లా ప్రచార కమిటి అధ్యక్షుడు పెన్మెత్స రామరాజు, వినుకొండ వీరన్నకాపు, కంకటాల సతీష్ పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో ప్రతి ఇంటికీ వైద్యం

తాడేపల్లిగూడెం రూరల్: ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ ద్వారా ప్రతి ఇంటికి వైద్యం అందించిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని నవాబుపాలెం గ్రామ సచివాలయం వద్ద 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ సంపత్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల్లో ఇవ్వని హామీలను సైతం అమలు చేశారన్నారు. నవరత్నాలు ద్వారా అన్నివర్గాలను ఆదుకోవడం జరిగిందన్నారు. ఇటీవల కురిసిన వర్షాలను దృష్టిలో ఉంచుకుని త్వరితగతిన మిల్లులకు ధాన్యాన్ని తరలించి, ఆదుకోవడం జరిగిందన్నారు. రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో జగన్, నియోజకవర్గంలో కొట్టు సత్యనారాయణను గెలిపించుకోవాలన్నారు. జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు మాట్లాడుతూ ప్రజలందరికీ సంక్షేమం అందించిన ముఖ్యమంత్రి దేశ చరిత్రలోనే లేరన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు కొట్టు విశాల్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ విద్య అందించాలని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో సీఎం జగన్‌ను, మంత్రి కొట్టు సత్యనారాయణను ఆశీర్వదించాలన్నారు. అనంతరం గ్రామ సచివాలయం వద్ద 18 కోట్ల 59లక్షల 36వేల 442 రూపాయల విలువైన సంక్షేమ బ్యానర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్లు వెలిశెట్టి నరేంద్రకుమార్, జద్దు హరిబాబు, చిక్కాల సత్యనారాయణ, సచివాలయ కన్వీనర్ మద్దుకూరి మెహెర్‌ప్రసాద్, నాయకులు బండి శ్రీనివాస్, కొండేటి భీముడు, నిమ్మల వెంకటరత్నం, కొండేటి వెంకటసత్యనారాయణ, చిన్న, సానేపు అబ్బులు, పెదగాడి సత్యనారాయణ, బండి సర్వేశ్వరరావు (బుజ్జి), ఆకుల ధనశేఖర్, ఈవోపీఆర్డీ ఎం.వెంకటేష్, పంచాయతీ కార్యదర్శి కే.రమేష్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలి

పెంటపాడు: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ఆశీర్వదించాలని ఎంపీపీ దాసరి హైమావతి, జెడ్పీటీసీ ఉప్పులూరి వరలక్ష్మిలు పేర్కొన్నారు. పెంటపాడు మండలం రావిపాడు, వల్లూరుపల్లి గ్రామాల్లో మంగళవారం సాయంత్రం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం మండల పార్టీ అధ్యక్షుడు కైగాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో రెండు గ్రామాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా రావిపాడు సర్పంచ్, మండల సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు పెన్నాడ సూరిబాబు, రాచర్ల సొసైటీ అధ్యక్షుడు కుంచే సుబ్రహ్మణ్యంల అధ్యక్షతన జరిగిన సమావేశంలో తొలుత గ్రామంలో సంక్షేమ అభివృద్ధిపై పోస్టర్ల ఆవిష్కరించారు. అనంతరం రెండు గ్రామాల్లో పార్టీ జెండా ఎగురువేసారు. ఈ సందర్భంగా పార్టీ గౌరవ అధ్యక్షుడు గుండు మోగుల సాంబయ్య, మండల వ్యవసాయసలహామండలి అధ్యక్షుడు కట్టుబోయిన కృష్ణప్రసాద్‌లు మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా, అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రావిపాడు సొసైటీ అధ్యక్షుడు కైగాల గణపతి, ఎంపీటీసీ సభ్యులు బొచ్చెల తాతారావు, మండల గృహసారథుల కన్వీనర్ మైలవరపు పెదబాబు, రావిపాడు సొసైటీ మాజీ అధ్యక్షుడు దేవ వెంకటరమణ, ములగాల రామసత్యనారాయణలు, పెన్నాడ రాఘవ, వల్లూరుపల్లి ఎంపీటీసీ సభ్యులు దెయ్యం శ్రీనివాసరావు, రెండు గ్రామాల కార్యదర్శులు శోభన్, రామారావు, కార్యక్రమ కన్వీనర్ శివారెడ్డి, వలంటీర్లు, గృహసారథులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా శ్రేయస్సే ముఖ్యమంత్రి లక్ష్యం

ఇరగవరం: అర్హత గల ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలను అమలు చేస్తూ, ఆకుటుంబంలో వెలుగులు నింపుతూ ప్రజల శ్రేయస్సే లక్ష్యంగా కృషి చేస్తున్న నేత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని ఇరగవరం జెడ్పీటీసీ పంపన అంజిబాబు అన్నారు. మండలంలోని రేలంగి–3 సచివాలయ పరిధిలో మంగళవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా సంక్షేమ పథకాల బోర్డులను, వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం జెడ్పీటీసీ అంజిబాబు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రంలో ప్రజారంజక పాలన సాగుతుందని తెలిపారు. గ్రామ ప్రజలకు గ్రామంలో జరిగిన అభివృద్ధి పనుల వివరాలను వివరించారు. సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు గ్రామంలోని ప్రతి కుటుంబం వద్ద వెళ్లి చేకురిన లబ్ధి, పథకాల వివరాలు తెలియజేయాలన్నారు. సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలంటే మళ్లీ సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి రావాలని అందరూ కోరుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చేబ్రోలు స్వరాజ్యం, డీసీఎంఎస్ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు, వైస్ ఎంపీపీ చీలీ మెంట రాజు, ఎంపీటీసీలు, మహలక్ష్మీ, కిరణ్మయి, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు పులుపు అనిల్, రేలంగి సొసైటీ అధ్యక్షుడు నడుంపల్లి రాంబాబు రాజు, నాయకులు చేబ్రోలు పెద్ది రాజు, ఈవోపీఆర్డీ నరసింహమూర్తి, అధికారులు, మండల పార్టీ అధ్యక్షుడు కొప్పిశెట్టి దుర్గా ప్రసాద్, కార్యదర్శి బి లక్ష్మీ నారాయణ, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు నాయకులు పాల్గొన్నారు.



అత్తిలి : ఉరదాళ్లపాలెం గ్రామంలో సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ



పెంటపాడు: గృహ సారథులకు కిట్లు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



తాడేపల్లిగూడెం రూరల్: సచివాలయం వద్ద సంక్షేమ పథకాల బ్యానర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

అంగన్‌వాడీలకు ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలి

తాడేపల్లిగూడెం రూరల్: అంగన్‌వాడీ వర్కర్లకు ప్రభుత్వ పథకాలు వర్తింప జేయాలని అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కే.ఝాన్సీ లక్ష్మి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కే.ఝాన్సీలక్ష్మి మాట్లాడుతూ తాము అధికారంలోకి రాగానే తెలంగాణా కంటే అదనంగా జీతాలు ఇస్తామని చెప్పి, మోసగించారన్నారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు మేరకు అంగన్‌వాడీ వర్కర్లకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని తదితర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు కండెల్లి సోమరాజు, దీన స్వరూప, ప్రభరాణి, వరలక్ష్మి, కే.కనకలక్ష్మి, బి.శైలజ, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.



తాడేపల్లిగూడెం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు

సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు నిరసన దీక్షలు

అత్తిలి: అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అత్తిలి తహసీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం నిరసన దీక్షను చేపట్టారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, పనిభారం తగ్గించాలని కోరారు. దీక్షా శిబిరాన్ని యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి గోపీమూర్తి, మండల ప్రధాన కార్యదర్శి ఎ అప్పలరాజు, కౌలు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కేతా గోపాలం, వ్యవసాయ కార్మిక సంఘం సంయుక్త కార్యదర్శి బళ్ల చినవీరభద్రరావు సందర్శించి సంఘీభావం తెలిపారు. దీక్షా శిబిరంలో అంగన్‌వాడీ కార్యకర్తలు తులసి, దీపికారాణి, సత్యవతి, మాధవి, తదితరులు పాల్గొన్నారు.

తపాలా ఉద్యోగుల సమ్మె

తణుకు: తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని తపాలా శాఖ ఉద్యోగులు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఆల్ ఇండియా గ్రామీణ తపాలా ఉద్యోగులు పిలుపు మేరకు ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యుడు బొద్దాని నాగరాజుతో కలిసి తణుకు హెడ్ పోస్టాఫీసు వద్ద సమ్మె శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు.ఈ సందర్భంగా భీమారావు మాట్లాడుతూ గ్రామీణ తపాల ఉద్యోగులకు స్టేటస్ కల్పించాలని, గ్రామీణ ఉద్యోగుల్ని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, గ్రాట్యుటిని రూ.1.50 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు పెంచాలని, గ్రూప్ ఇన్సూరెన్స్ ఐదు లక్షలు ఇవ్వాలని, 180 రోజులు సెలవులు ఇచ్చి దాన్ని కాష్‌గా మార్చుకునే అవకాశం కల్పించాలని కోరారు.



తపాలా ఉద్యోగుల దీక్షలకు సంఘీభావం తెలియజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

తాడేపల్లిగూడెంలో...

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఆలిండియా గ్రామీణ దాక్ సేవక్ యూనియన్ నిరవధిక సమ్మెను జయప్రదం చేద్దామని తాడేపల్లిగూడెం డివిజన్ యూనియన్ అధ్యక్షుడు కె.రవీంద్ర, సెక్రటరీ ఎస్.రమేష్, కోశాధికారి పి.పవన్‌కుమార్‌లు పేర్కొన్నారు. ఆలిండియా యూనియన్ పిలుపు మేరకు ఉద్యోగాల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పట్టణ హెడ్ పోస్టాఫీస్ వద్ద డివిజన్ ఉద్యోగులచే మంగళవారం ఉదయం నిరసన, ధర్నా కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో డివిజన్‌లోని యూనియన్ పోస్టల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో మెలగాలి

తణుకు టౌన్: విద్యార్థులందరిలో ఉన్న ప్రతిభ, సామార్థ్యాల నుంచి అవసరాలకు అనుగుణంగా వినియోగించే విధంగా విలువలతో కూడిన విద్య దోహదం చేస్తుందని యునెస్కో సోషల్ ఎమోషనల్ ఎడ్యుకేషన్ యూత్ ప్రోగ్రాం నేషనల్ ఆఫీసర్ డాక్టర్ రీచా బన్సాల్ చెప్పారు. మంగళవారం తణుకులోని శ్రీ చిట్టూరి ఇంద్రయ్య మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోషనల్ ఎమోషనల్ ఇంటిలిజెన్స్, అండ్ వాల్యూస్ ఆఫ్ ఎడ్యుకేషన్ అనే అంశంపై నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను ద్దేశించి మాట్లాడారు. ఈకార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీ అనిల్‌కుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రీచా బన్సాల్ మాట్లాడుతూ బావోద్వేగం అనే లక్షణం అన్ని జీవుల్లో ఉన్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో పాల్గొన్న ఢిల్లీకి చెందిన వ్యక్తిత్వ నిపుణురాలు శోభితారావు మాట్లాడుతూ ఎప్పుడైనా మనకు భాద కలిగినప్పుడు కృంగిపోకుండా జీవితంలో జరిగిన సంతోషకరమైన సంఘటనలను గుర్తుకు తెచ్చుకోవడం ద్వారా బాదలను నుంచి మామూలు స్థితికి చేరుకోవాలని చెప్పారు. ఎప్పుడూ ఆత్మవిశ్వాసం, సానుకూల దృక్పధంతో మెలగాలని కోరారు. ఈకార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కేఆర్ ఫణిధర్, అధ్యాపకులు రామ్‌గోపాల్, సుధాదర్, ఎస్ విష్ణువర్ధన్, ఇతర అధ్యాపక సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.



తణుకులో మాట్లాడుతున్న నేషన ల్ యూత్ ప్రోగ్రా ఆఫీసర్ డాక్టర్ రీచా బన్సాల్

యోగా పోటీల్లో తణుకు విద్యార్థి ప్రతిభ

తణుకు టౌన్: ఈనెల 9వ తేదీ నుంచి 11వ తేదీ వరకూ ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ని ఆంధ్రప్రదేశ్ యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆర్టిస్టిక్ సోలో, ట్రెడిషనల్ యోగాలతో తణుకు ఎస్‌డీ కాలేజ్ ఆఫ్ టెక్నాలజీకి చెందిన విద్యార్థినీ, రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానం సాధించినట్లు ప్రిన్సిపాల్ వీ సత్యనారాయణ రెడ్డి తెలిపారు. మూడు రోజుల పాటు జరిగిన పోటీల్లో తమ కళాశాలకు చెందిన ఎంబీఏ మొదటి సంవత్సరం విద్యార్థినీ కే కార్తీక ఉషశ్రీ ఆర్టిస్టిక్, ట్రెడిషనల్ విభాగాల్లో మొదటి స్థానం సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని కార్తీక ఉషశ్రీని కళాశాల కరస్పాండెంట్ చిట్టూరి సత్య ఉషారాణి, యోగా అధ్యాపకులు అబ్బులు చౌదరి, ఇతర అధ్యాపక సిబ్బంది అభినందించారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



తణుకులో ఆంజనేయస్వామి విగ్రహం వద్ద పూజలు నిర్వహిస్తున్న భక్తులు

తణుకు అర్బన్: కార్తీకమాసం మంగళవారం అమావాస్య సందర్భంగా స్థానిక సజ్జాపురం అంగర్‌పాస్ ప్రాంతంలో వేంచేసియున్న ఆంజనేయస్వామివారి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక మహిళలు కార్తీక దీపాలను వెలిగించి అభిషేకాలు జరిపారు. ఆలయ అర్చకులు వర ప్రసాద్ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

విద్యార్థులను ఉన్నత పౌరులుగా తీర్చిదిద్దాలి



తాడేపల్లిగూడెం మండల పరిషత్ సమావేశ మందిరంలో మాట్లాడుతున్న ఎంఈవో వి.హనుమ

తాడేపల్లిగూడెం రూరల్: విద్యార్థులను ఉన్నత పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని ఎంఈవో వి.హనుమ అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో విద్యపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో వి.హనుమ మాట్లాడుతూ విద్యతో పాటు వారి ఆరోగ్యంపై ఉపాధ్యాయులు శ్రద్ధ వహించాలన్నారు. ఆరోగ్య సిబ్బంది పాఠశాలలకు వచ్చిన సందర్భంలో క్రమం తప్పకుండా విద్యార్థుల హిమోగ్లోబిన్ శాతాన్ని పరీక్షించాలన్నారు. విద్యార్థుల విద్యాభ్యాసం, వర్క్ బుక్ వంటి వాటిని ఉపాధ్యాయులు పర్యవేక్షించాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైనా ఆహారాన్ని అందించాలన్నారు. వాచ్‌మెన్, స్వీపర్లు జీతభత్యాలకు సంబంధించిన రిపోర్టును నిర్ణీత సమయానికి కార్యాలయంలో అందజేయాలన్నారు. ఈ నెల 16వ తేది లోపు అన్ని పాఠశాలలను పరిశీలించడం జరుగుతుందన్నారు. ఎంఈవో–2 పీఎంకే.జ్యోతి మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకం తదితర ప్రభుత్వ పథకాల అమలుకు సంబంధించిన యాప్‌లను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీలు బత్తుల నానిబాబు, రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



తణుకులో ఆర్టీసీ డిపోలో ధర్నా నిర్వహిస్తున్న ఎన్ఎంయూఏ నాయకులు



తాడేపల్లిగూడెం ఆర్టీసీ డిపో వద్ద ధర్నా చేస్తున్న యూనియన్ నాయకులు

తణుకు అర్బన్: ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం తణుకు డిపోలో నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ (ఎన్ఎంయూఏ) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా డిపో ఎన్ఎంయూఏ చైర్మన్ టీఎస్ రావు మాట్లాడుతూ కార్మికులకు బకాయిలున్న 2017 డీఏ ఏరియర్స్ పెండింగ్ బకాయిలు చెల్లించాలని, పెండింగ్‌లో కార్మికుల కేసులను పరిష్కరించాలని, కార్మికులను బలవంతంగా టిమ్ సర్వీసులకు పంపించడం మానుకోవాలని, వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. డిపో సెక్రటరీ బీవీఎన్ సుబ్బారావు, పబ్లిసిటీ సెక్రటరీ కె.దుర్గాప్రసాద్, ఎస్.వెంకటేశ్వర్లు, పీఏ సత్యనారాయణ, బి.శేఖర్, పి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు రక్షణ కల్పించాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): విధి నిర్వహణలో ఉన్న ఆర్టీసీ ఉద్యోగులపై దాడులకు పాల్పడుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఏపీ పీటీడీ నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం తాడేపల్లిగూడెం ఆర్టీసీ డిపో గ్యారేజ్ వద్ద సమావేశం నిర్వహించి, అనంతరం ధర్నా చేశారు. ఈపీఎఫ్ 95, అరియర్స్, ఈహెచ్ఎస్, ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ ధర్నాలో డిపో జోనల్ నాయకులు ఎ.నాగేశ్వరరావు, ఎస్.భుజంగరావు, ఎ.రవికుమార్, పి.కొండలరావు, సీహెచ్ పెద్దిరాజు, ఇతర నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఏపీ సీడ్స్ మహిళా కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

తణుకు: ఏపీ సీడ్స్‌లో పని చేస్తున్న మహిళా కార్మికుల దినసరి కనీస వేతనం రూ.600గా నిర్ణయించి అమలు చేయాలని కోరుతూ మంగళవారం ఏపీ సీడ్స్ మహిళా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో తణుకు ఏపీ సీడ్స్ కార్యాలయంలో ఏపీ సీడ్స్ జిల్లా మేనేజర్ బి.శారదకు వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా యూనియన్ అధ్యక్షుడు కోనాల భీమారావు మాట్లాడుతూ మహిళా కార్మికుల వేతన సవరణ జరిగి రెండేళ్లు గడిచిందన్నారు. రోజు రోజుకు పెరుగుతున్న ధరలతో ఇస్తున్న వేతనాలు సరిపోక కార్మికులు దుర్భర జీవనం సాగిస్తున్నారన్నారు. తక్షణమే కార్మికుల వేతనాలు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా రోజు వారీ కూలీ రూ. 600 పెంపుదల చేయాలని భీమారావు కోరారు. ఏపీ సీడ్స్ మహిళా వర్కర్స్ యూనియన్ కార్యదర్శి సావారపు దేవి, పసుపులేటి దానమ్మ, వలవల అరుణకుమారి, ఆరవల్లి దుర్గ తదితరులు పాల్గొన్నారు.



తణుకులో ఏపీ సీడ్స్ మేనేజర్ శారదకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నవ దిశ

ఆర్టికల్ 370 ఎత్తివేతను సుప్రీంకోర్ట్ సమర్థించింది. జమ్ము-కశ్మీర్‌లకు రాష్ట్రహోదా ఇచ్చి ఎన్నికలు నిర్వహించమంది. మరోవైపు అక్కడ యువగళాలు మారుతున్న కశ్మీర్‌ను గానం చేస్తున్నాయి. 14 ఏళ్ల ర్యాపర్ హుమైరా జా విడుదల చేసిన పాట 'బదల్తా కశ్మీర్' మార్పును ఆహ్వానిస్తూ కొత్త ఆశను రేపుతోంది. హుమైరా జా పాటను భారత ప్రభుత్వం ఇన్‌స్టాలో షేర్ చేసింది. 'నేను ఇలాగే ముందుకెళ్తాను' అంటున్న హుమైరా పరిచయం.


హుమైరా జా

బదల్తా కశ్మీర్

'బద్‌లా జో కశ్మీర్... బద్‌లా హై సారా దౌర్' అని పాడుతోంది హుమైరా జా.

'కశ్మీర్ మారుతోంది... కశ్మీర్ ధోరణి మారుతోంది... అభివృద్ధి వైపు అడుగులు వేస్తోంది' అంటూ ఆమె పాడిన పాట ఇప్పుడు కశ్మీర్‌వాసులనే కాదు, దేశాభిమానులను కూడా ఆకర్షిస్తోంది. హుమైరా ఈ పాటను ఎం.సి.రా అనే మరో ర్యాపర్ కలిసి పాడింది. కశ్మీర్‌లో తాజా అభివృద్ధి పరిణామాలను పాటలో మిళితం చేస్తూ వీరు విడుదల చేసిన 'బదల్తా కశ్మీర్' పాట కశ్మీర్ భవిష్యత్తు మీద ఆశను కలిగిస్తోంది.

'మా నానమ్మ, తాతయ్యల కాలంలో కశ్మీర్ ఎలా ఉండేది... (ఆర్టికల్ 370 ఎత్తేశాక) ఇప్పుడు ఎలా ఉందనేది నేను వారి మాటల్లో విన్నాను. నా కళ్లారా చూశాను. ఇక్కడ జరిగిన జి 20 సమ్మిట్, శ్రీనగర్‌ను స్మార్ట్‌సిటీగా తీర్చిదిద్దడం, కొత్త టన్నెల్స్ ఏర్పాటు... ఇంతకు ముందు చూడలేదు. మా ఊరు కంగన్ నుంచి శ్రీనగర్‌కు వెళ్లాలంటే గతంలో గంటన్నర పట్టేది. ఇప్పుడు గండర్‌బల్ దగ్గర బ్రిడ్జి కట్టాక ముప్పై నిమిషాల్లో వెళ్లిపోతున్నాము. ఇదంతా మారుతున్న కశ్మీరే' అంటుంది హుమైరా జా.

తొమ్మిదో తరగతి చదువుతున్న హుమైరా అలవోకగా ర్యాప్ సాంగ్స్ రాసి పాడుతుంది. హిందీ, ఉర్దూ, ఇంగ్లిష్ పదాలను టక్కున పట్టేట్టుగా వాడుతూ పాటలు రాసి పాడటం వల్ల గతంలోనే గుర్తింపు పొందినా 'బదల్తా కశ్మీర్' పాటతో ప్రపంచానికి తెలిసింది.


హుమైరా జా

'నేను రెండో క్లాస్‌లో ఉండగా యోయో హనీసింగ్ రాప్ ఆల్బమ్ విన్నాను. అది నాకు చాలా నచ్చింది. ఆ వయసులోనే అలా ర్యాప్ పాటలు ట్రై చేసేదాన్ని. అప్పుడే బజ్‌రంగి భాయ్‌జాన్ (2015) సినిమా షూటింగ్ మా ఏరియాలో జరిగితే అందులోని బాల నటి హర్షాలికి నేను బాడీ డబుల్ (డూప్)గా నటించాను. అలా నేను కూడా సినిమాల్లో నటించాలనుకున్నానుగానీ మా కశ్మీర్‌లో సినిమా పరిశ్రమ లేదు. అందుకని ర్యాపర్‌గా రాణించాలని నిశ్చయించుకున్నాను' అంటుంది హుమైరా.

కశ్మీర్‌లో ప్రతి ఏటా జరిగే 'ర్యాప్ బ్యాటిల్' పోటీల్లో పాల్గొని 2022, 2023 సంవత్సరాల్లో టైటిల్ గెలిచింది హుమైరా. '2022లో 15 మంది అబ్బాయిలు నాకు పోటీగా వచ్చారు. నేను ఒక్కదాన్నే ఆడపిల్లను. నేనే గెలిచాను' అంటుంది హుమైరా. 'కశ్మీర్‌లో అమ్మాయిలు స్పోర్ట్స్‌లో, కళల్లో, చదువులో, ఉద్యోగాల్లో రాణిస్తున్నారు. ఆ విషయాన్ని నా పాటలో చెప్పాను' అందామె.

ఈ పాటలోనే మేల్ వాయిస్ ఇచ్చిన ఎం.సి.రా 'ఇక్కడ ఇప్పుడు జీన్స్ ప్యాంట్ అమ్మాయిలు తొడుక్కుంటున్నారు. బట్టల్ని బట్టి వారిని జడ్జ్ చేసే రోజులు పోయాయి' అనే లైన్‌లు పాడాడు. హుమైరా, ఎం.సి.రా కలిసి 'మై కశ్మీరీ... మేరా దేశ్ హై హిందుస్తాన్' అని పాటను ముగిస్తారు.

ఈ పాటలో హుమైరా 'టెర్రరిస్టులకు ఇక్కడ చోటు లేదు. అనవసరంగా ఎవరి రక్తం పారడానికి వీల్లేదు' అనే లైన్లు పాడింది. 'నువ్వు చూపుతున్న అభివృద్ధి ఉత్తుత్తదే. అసలు వాస్తవం వేరే ఉంది అని కొందరంటున్నారుగా' అని విలేకరులు ప్రశ్నిస్తే 'అది వారి దృష్టికోణం. ఇది నా దృష్టికోణం' అంటుంది హుమైరా.

'కొంతమంది నన్ను ట్రోల్ చేస్తున్నారు. నేను పట్టించుకోను. నేను ఇలాగే ముందుకెళతాను. నా వెనుక ఒక్కరు నిలబడినా చాలు' అందామె.

కశ్మీర్ వెనుక హుమైరా వెనుక ఇప్పుడు చాలామంది ఉన్నారు. కశ్మీర్ అభివృద్ధికి అందరూ ప్రయత్నిస్తే 'నయా కశ్మీర్' దగ్గరిలోనే సాధ్యమవుతుంది.

ఛావీ రాజావత్ రాజస్థాన్‌లోని సోడా గ్రామంలో పుట్టి పెరిగింది. పట్నంలో ఉన్నత చదువులు చదివి, కళ్లు చెదిరే ప్యాకేజీతో కార్పొరేట్ ఉద్యోగంలో చేరింది. కానీ, చేస్తున్న ఉద్యోగాన్ని వదిలి గ్రామానికి వెళ్లింది. సర్పంచ్‌గా ఎన్నికల్లో నిలబడి గెలిచింది. పదేళ్లపాటు సర్పంచ్‌గా పనిచేసింది. మొదటి ఎంబీయే మహిళా సర్పంచ్‌గా వార్తల్లో నిలిచి, యుఎన్‌లో ప్రసంగం చేసింది. గ్రామాన్ని మోడల్ గ్రామంగా తీర్చిదిద్దింది. ఇప్పుడు గ్రామాభివృద్ధికి కృషి చేస్తూనే, హోటల్ వ్యాపారం చేస్తోంది. ఆసక్తి గలవారికి గుర్రపు స్వారీలో శిక్షణ ఇస్తోంది.

ఊరు రమ్మంది..!

ఒక ఎంబీయే సర్పంచ్.. ఒక మోడల్ గ్రామం

"2010లో తొలిసారి సర్పంచ్ అయినప్పుడు గ్రామ పరిస్థితి ఏ మాత్రం బాగా లేదు. గ్రామం తీవ్ర కరువుతో అల్లాడిపోయింది. సాగునీరు లేదు. 13–14 సంవత్సరాలుగా రుతుపవనాలు లేవు. భూగర్భ జలాలను వాడుకోలేకపోయేవారు. 3–4 గంటలకు మించి విద్యుత్ సరఫరా లేదు. రోడ్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. డ్రైనేజీ వ్యవస్థ అధ్వాన్నంగా ఉంది. ఈ సవాళ్లతో సోడా పంచాయితీ సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టాను. మొదటి టర్మ్‌లో కొన్ని పనులు పూర్తయ్యాయి.

మా ఊరు తనవైపు లాగింది..

మా తాత బ్రిగేడియర్ రఘుబీర్‌సింగ్ 1990 వరకు సర్పంచ్‌గా చేశారు. నాకు మా ఊరు అంటే ఎప్పుడూ ఇష్టమే. బెంగుళూరులోని రిషి వ్యాలీ స్కూల్, జైపూర్‌లోని మాయో కాలేజీ గర్ల్స్ స్కూల్‌లో చదువుకున్నాను. వేసవి సెలవులు వచ్చినప్పుడల్లా మా ఊరిలోనే ఉండేదాన్ని. ఢిల్లీలోని మహిళా శ్రీరామ్ కాలేజీ నుండి డిగ్రీ తీసుకున్నాక, పూణెలోని బాలాజా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మోడ్రన్ మేనేజ్‌మెంట్ నుండి ఎంబీయే పూర్తి చేశాను. ఏడేళ్లపాటు కార్పొరేట్ సెక్టార్‌లో వర్క్ చేశాను. లక్షల రూపాయల జీతం. కానీ, మా ఊరు వైపు నన్ను తన వైపు లాగింది.

■ మహిళకు రిజర్వ్ అని..

2010లో మా గ్రామ పంచాయితీ మహిళలకు రిజర్వ్ చేయబడింది. అప్పుడు మా ఊరి పెద్దలు నన్ను ఎన్నికల్లో నిలబడమని అడిగారు. ఆ సమయంలో సర్పంచ్‌ని అవ్వాలనే ఆలోచన కూడా చేయలేదు. గ్రామస్తులు మా అమ్మ నాన్నలను అడిగారు. 'ఏం చేయాలనుకున్నా తన ఇష్టం, మా బలవంతం ఉండదు' అని చెప్పారు. నాకు అప్పటి వరకు గ్రామ సభలు ఎలా జరుగుతాయి, పంచాయితీలకు నిధులు ఎలా వస్తాయో తెలియదు. ఆ విషయాలను గ్రామస్తులే చెప్పారు. ఆ విధంగా పంచాయితీ ఎన్నికల్లో నిలబడి, గెలిచాను. మా ఇంట్లో మా తాత తర్వాత నేను సర్పంచ్‌ని అయ్యాను.

■ వర్షపు నీటి సంరక్షణ

ముందుగా ఊరి భవితవ్యాన్ని ఒంటరిగా మార్చలేమని, ప్రజలంతా కలిసికట్టుగా కృషి చేస్తేనే గ్రామం అభివృద్ధి చెందుతుందని అందరికీ స్పష్టంగా చెప్పాను. నేను వ్యూహంతో పనిచేయడం ప్రారంభించాను. ప్రభుత్వం, ప్రైవేట్ రంగం, గ్రామాలను అనుసంధానించడం, కరువును ఎదుర్కోవడం నేను ఎదుర్కొన్న అతిపెద్ద సవాళ్లు. గ్రామంలోని నీటివనరులన్నీ పూడికతో నిండిపోయాయి. సుమారు 100 ఎకరాల్లో విస్తరించి ఉన్న నీటి వనరుల్లో పూడిక మట్టిని తొలగించేందుకు లక్షల రూపాయలు సేకరించి, ఖర్చు చేశాం.

■ మహిళలు ముందు

గ్రామపంచాయితీ నా కుటుంబం లాంటిది. నేను మీటింగులు పెట్టడం మొదలు పెట్టగానే ఏయే ప్రాజెక్టుల్లో ఎలా పనిచేస్తున్నానో చెప్పేదాన్ని. ఈ ప్రాజెక్టుల గురించి వారు ఏమనుకుంటున్నారో అందరి అభిప్రాయాలు తెలుసుకునేదాన్ని. అలాగే, ఎంత డబ్బు ఖర్చు అవుతుందో కూడా వివరించేదాన్ని. పనులు సజావుగా అయ్యేలా అధికారులను కలిసి ఆరా తీయమని గ్రామస్తులకు చెప్పేదాన్ని. మహిళల బృందం డిజైనర్ ల్యాంప్‌లు, కొవ్వొత్తులు, మసాలా దినుసులు వంటి ఉత్పత్తులు తయారు చేయడం మొదలుపెట్టారు. ఇవి మంచి ధరకు అమ్ముడు పోవడం మొదలయ్యింది. దీంతో మహిళల జీవితం మెరుగుపడింది. రెండేళ్లలో 950 ఇళ్లకు గాను 800 మరుగుదొడ్లు నిర్మించాం. 24 గంటలూ కరెంట్ అందుబాటులోకి వచ్చింది.


ఛావీ రాజావత్





■ రోడ్ల ప్రాధాన్యత

నా ఎజెండాలో రోడ్ల ప్రాధాన్యత స్పష్టంగా ఉంచాను. ముందు ప్రైవేట్ బస్సుల సహాయం తీసుకున్నాను. బాలికల కోసం పాఠశాల, మహిళల స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేశాను. మూతపడిన బి.ఎడ్ కాలేజీని స్వాధీనం చేసుకొని దానిని బాలికల చదువుకోసం కేటాయించాను. ఓ ప్రైవేట్ కంపెనీ 200 టేబుళ్లు, బెంచీలను అందజేసి మా వెన్ను తట్టింది.

■ అందరికీ బ్యాంకు ఖాతా..

సర్పంచ్ అయిన ఐదేళ్లలోనే రోడ్లు, డ్రైన్లు, అందరికీ బ్యాంకు ఖాతా తెరిపించాను. ఎప్పుడూ ఫీల్డ్ వర్క్‌లోనే ఉండేదాన్ని. బాల్యవివాహాల వల్ల కలిగే నష్టాల, చదువు ప్రాముఖ్యతను వివరించేదాన్ని.. నా స్వభావం అందరినీ కలుపుకొని ఉంటుంది. ఐక్యరాజ్య సమితి 11వ ఇన్ఫో పావర్టీ వరల్డ్ కాన్ఫరెన్స్‌ను నిర్వహించినప్పుడు మొదటిసారి భారతదేశం నుండి ఒక మహిళా సర్పంచ్‌గా దేశం తరపున ప్రాతినిధ్యం వహించాను. ఇది నాకు గర్వంగా అనిపించింది. అక్కడ వారందరి మదిలో సర్పంచ్ అంటే తలపై ముసుగు వేసుకుని ఉన్న గ్రామస్థురాలు అనుకున్నారు. కానీ, నన్ను కార్పొరేట్ లుక్‌లో చూసి అందరూ ఆశ్చర్యపోయారు. సోడా విలేజ్ అభివృద్ధికి డబ్బు కంటే వ్యక్తులు, అందరి సమష్టి కృషి అవసరం అని ఫోరమ్‌లో చెప్పాను.

రెండుసార్లు సర్పంచ్‌గా నా విధులను నిర్వర్తించాను. తర్వాతి వారికి అవకాశాలు ఇవ్వాలని నేను మళ్లీ పోటీ చేయలేదు. ఇప్పుడు హోటల్‌ని నిర్వహిస్తున్నాను. గుర్రపు స్వారీ వచ్చు కాబట్టి, ఆసక్తి గలవారికి శిక్షణ ఇస్తున్నాను' అని వివరిస్తుంది ఈ యంగ్ లీడర్.

"ఎదుటి వారు చెప్పేది శ్రద్ధగా వింటే మనకు తెలియని ఎన్నో ప్రశ్నలకు సమాధానాలు దొరుకుతాయి. ప్రధాని నరేంద్ర మోదీ మన్‌కీబాత్ కార్యక్రమంలో అనేక విషయాలను ప్రస్తావిస్తుంటారు. వాటిలో ఒకటి నన్ను ఏకంగా ఎంట్రప్రెన్యూర్‌గా మార్చింది. ఈరోజు నేను ఆర్గానిక్ ఎంట్రప్రెన్యూర్‌గా ఎదిగాను. అదే మన్‌కీ బాత్ కార్యక్రమంలో నన్ను ప్రశంసించడం ఎంతో సంతోషంగా ఉంది" అని చెబుతూ తెగ మురిసిపోతోంది వర్ష.


వర్ష

బాత్ చూపిన బాట

కర్ణాటకలోని చామరాజ్‌నగర్ జిల్లా ఆలహళ్లీ గ్రామానికి చెందిన వర్ష ఎమ్‌టెక్ చదివింది. చదువు పూర్తి కాగానే అందరిలా ఉద్యోగం కోసం చూడకుండా సరికొత్తగా ఏదైనా చేయాలనుకుంది. ఈ క్రమంలోనే ఏం చేయాలా అని ఆలోచిస్తున్న వర్ష.. ఓ రోజు అనుకోకుండా మన్‌కీబాత్ వినింది. ఆ కార్యక్రమంలో అరటి ఆకులను ఉపయోగపడే వనరులుగా ఎలా మారుస్తున్నారో మోదీ ప్రస్తావించారు. ప్రకృతిని ఇష్టపడే వర్షకు ఇది బాగా నచ్చడంతో.. అరటి బోదె, ఆకులతో హ్యాండిక్రాఫ్ట్స్ తయారు చేయాలని నిర్ణయించుకుంది.



వీడియో చూసి...

అరటి కాండాలను ఉపయోగపడే వస్తువులుగా ఎలా మార్చాలో వర్షకు తొలుత అర్థం కాలేదు. తరువాత యూట్యూబ్‌లో వెతికి ఒక వీడియో ద్వారా కొంత సమాచారం తెలుసుకుంది. కోయంబత్తూరు, తమిళనాడులోని మరికొన్ని ప్రాంతాల్లో అరటి వ్యర్థాలను అందమైన వస్తువులుగా ఎలా మారుస్తున్నారో వివరంగా తెలుసుకుంది. ఆ తరవాత వ్యాపారానికి కావాల్సిన యంత్రాలను కొనుగోలు చేసి ఉమ్మతూరు సమీపంలో 'ఆకృతి ఇకోఫ్రెండ్లీ' పేరిట ఎంటర్‌ప్రైజ్‌ను ఏర్పాటు చేసింది.

అరటికాండాలు, ఆకులను సేకరించి యంత్రాలతో ప్రాసెస్ చేసి నారతీసి, ఫ్లోర్‌మ్యాట్స్, బ్యాగ్స్, పర్సులు, హ్యాండీ క్రాఫ్ట్స్, అరటి గుజ్జు నుంచి తీసిన రసంతో సహజసిద్ధమైన ఎరువులు తయారు చేసి విక్రయిస్తోంది. కస్టమర్ల నుంచి మంచి ఆదరణ లభించడంతో ఆర్గానిక్ షాపులు, గూగుల్, ఫ్లిప్‌కార్ట్, అమేజాన్ వంటి ఆన్‌లైన్ షాపుల్లో సైతం ఆకృతి వస్తువుల విక్రయాలు జరుగుతున్నాయి. ఇలా అరటి వ్యర్థాలను అందమైన వస్తువులుగా మారుస్తూ కొంతమందికి ఉపాధి కల్పించడంతోపాటు.. రైతులకు ఆదాయం వచ్చేలా చేస్తోంది వర్ష.

వర్ష తన భర్త శ్రీకాంత్ సాయంతో చేస్తున్న ఈ ఇకో–ఫ్రెండ్లీ బిజినెస్ గురించి తెలియడంతో కొన్ని కంపెనీల నుంచి భారీగా ఆర్డర్లు వస్తున్నాయి. "భవిష్యత్‌లో తన వ్యాపారాన్ని మరింత విస్తరించి ఎక్కువమందికి ఉపాధి కల్పిస్తాను" అని వర్ష చెబుతోంది. గ్రామాల్లోని మహిళలు సైతం వ్యాపారవేత్తలుగా మారేందుకు, ఉద్యోగం దొరకనివారు ఉపాధిని ఇలా సృష్టించుకోవచ్చని చెప్పడానికి ఉదాహరణగా నిలుస్తోంది వర్ష. నవంబర్ నెల మన్‌కీ బాత్ కార్యక్రమంలో వర్ష ఎంట్రప్రెన్యూర్ జర్నీ గురించి మోదీ ప్రస్తావించడం విశేషం.

కొత్త సంవత్సరం దగ్గరలో ఉంది. కొత్త సంవత్సరాన్ని ఆహ్వానిస్తూ 'హ్యాపీ న్యూ ఇయర్' పాట పాడగానే సరిపోతుందా? 'పాటతోపాటు ప్రణాళిక కూడా ఉంది' అంటుంది మన జెన్ జెడ్. కొత్త సంవత్సరంలో జెన్ జెడ్ లక్ష్యాలు, ప్రణాళికలు, అభిరుచులకు సంబంధించి 'ట్రెండ్ టాక్ రిపోర్ట్-2024' అద్దం పడుతోంది.

యూత్ పల్స్

Generation Z

భవిష్యత్ చిత్ర 'వర్ణ' మాల

ఇండియా, యూఎస్, యూకే, బ్రెజిల్, సౌత్ కొరియా దేశాలలోని జెన్ జెడ్ ట్రెండ్స్‌కు సంబంధించి 'ట్రెండ్ టాక్ రిపోర్ట్'ను విడుదల చేసింది ఇన్‌స్టాగ్రామ్. వర్త్ గ్లోబల్ స్టైల్ నెట్‌వర్క్ (డబ్ల్యూజీఎస్‌ఎన్)తో కలిసి నిర్వహించిన ఈ సర్వేలో 2024 సంవత్సరానికి సంబంధించి ఫ్యాషన్, బ్యూటీ, సోషల్ మీడియా, ఫ్రెండ్‌షిప్‌కు సంబంధించిన ప్రశ్నలు జెన్ జెడ్‌ను అడిగారు.

ఈ రిపోర్ట్ ప్రకారం ఫ్యాషన్ ట్రెండ్స్, బ్యూటీ అండ్ ఫుడ్ విభాగాలలో మన దేశం ట్రెండ్ సెట్టర్‌గా ఉంది. ఫుడ్ విషయానికి వస్తే కొత్త రుచులను ఆస్వాదించడానికి ఆసక్తి చూపుతున్నారు. ఇతరుల కంటే భిన్నంగా కనిపించే వస్త్రధారణకు ప్రాధాన్యత ఇస్తున్నారు. కొత్త హెయిర్‌స్టైల్‌ను ఎంపిక చేసుకుంటున్నారు.

2024కు సంబంధించి 'జెన్ జెడ్' ప్రాధాన్యతలలో హెల్త్, ట్రావెల్, కెరీర్‌లు మొదటి స్థానంలో ఉన్నాయి.

తమ కెరీర్‌పై ప్రధానంగా దృష్టి పెట్టబోతున్నట్లు 43 శాతం మంది తెలియజేశారు. ఇతర దేశాలతో పోల్చితే మన 'జెన్ జెడ్' వ్యాపారానికి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తోంది. సంపద సృష్టికి వ్యాపారమే మార్గం అని చెబుతోంది.

మన దేశంలో 'జెన్ జెడ్'లో ఎక్కువ మంది స్పోర్ట్స్‌కు సంబంధించి సూపర్ ఫ్యాన్స్ ఉన్నారు.

లైఫ్ అడ్వైజ్, తమ ప్రొఫెషన్‌కు సంబంధించి కంటెంట్‌కు ప్రాధాన్యత ఇచ్చేవారి సంఖ్య ఎక్కువగానే ఉంది.

జీఆర్‌డబ్ల్యూఎం(గెట్ రెడీ విత్ మీ)లాంటి క్రియేటివిటీతో కూడిన ఫ్యాషన్ ట్రెండ్స్‌పై అమిత ఆసక్తి ప్రదర్శిస్తున్నారు. మన దేశంలో జెన్ జెడ్‌లో 44 శాతం మంది సొంత ఆలోచనలకు ప్రాధాన్యత ఇచ్చే డీఐవై(డూ–ఇట్–యువర్ సెల్ఫ్) విధానాన్ని ఇష్టపడుతున్నారు.

సంగీతం విషయానికి వస్తే ఏఆర్ రెహమాన్, శ్రేయా ఘోషల్, అనిరుథ్ నుంచి సౌత్ కొరియన్ మ్యూజిక్ బ్యాండ్ 'బీటీఎస్ ఆర్మీ' వరకు ఇష్టపడుతున్నారు. వారికి నచ్చిన వీడియో గేమ్స్‌లో ఫోర్ట్‌నైట్, కాల్ ఆఫ్ డ్యూటీ, రాబ్లక్స్... మొదలైనవి ఉన్నాయి.

గుడ్ ప్లానింగ్

2024లో యువతరం ఆసక్తి చూపుతున్న రంగాలలో ట్రావెల్ ఒకటి. ట్రావెల్ ప్రేమికులకు టాన్యాలాంటి ట్రావెల్ వ్లోగర్‌ల సలహాలు ఉపయోగపడుతున్నాయి. అడ్వర్‌టైజింగ్ రంగంలో ఉద్యోగం చేసిన టాన్యా సోలోగా ట్రావెలింగ్ మొదలుపెట్టి తాను వెళ్లిన ప్రదేశాలకు సంబంధించి వ్లోగింగ్ మొదలుపెట్టింది. యూట్యూబ్, ఎయిర్‌టెల్‌లాంటి పెద్ద కంపెనీలతో కలిసి పనిచేసింది. ట్రావెలింగ్‌పై ఆసక్తి ఉన్నవారికి గుడ్ ప్లానింగ్ అనేది ముఖ్యం అంటుంది టాన్యా. 'గుడ్ ప్లానింగ్'కు సంబంధించి టిప్స్ చెబుతుంటుంది.





ప్రణాళిక ఉండాలి

దిల్లీకి చెందిన మౌనికా మాలిక్ బిజినెస్ అండ్ ఫైనాన్స్‌కు సంబంధించి కంటెంట్ క్రియేటర్‌గా చిన్న వయసులోనే పెద్ద పేరు తెచ్చుకుంది. పర్సనల్ ఫైనాన్స్ నుంచి స్టాక్‌మార్కెట్ వరకు ఎన్నో విషయాలను సులభంగా అర్థమయ్యేలా చెబుతోంది. 'ఒక రంగంపై ఇష్టం ఉన్నంత మాత్రాన విజయం చేరువ కాదు. భవిష్యత్ ప్రణాళిక తప్పనిసరిగా ఉండాలి. పరిశ్రమకైనా, వ్యక్తికైనా ఇది ముఖ్యం' అంటుంది మాలిక్.

జెన్ జెడ్‌లోని పదిమందిలో తొమ్మిదిమంది వారు ఇష్టపడే రంగాలకు సంబంధించి సెలబ్రిటీల అభిమానగణంలో ఉన్నారు. తమ అభిమాన సెలబ్రిటీలు, అథ్లెట్లు, క్రియేటర్ నుంచి జెన్ జెడ్ రాబోయే కాలంలో ఆశిస్తున్నది ఏమిటి? అనే ప్రశ్నకు వినిపించే జవాబు... లైఫ్ అడ్వైజెస్, వారి ప్రొఫెషన్‌కు సంబంధించిన కంటెంట్... ఇక మీమ్స్ విషయానికి వస్తే మూడింట ఒక వంతు మంది 'బ్యాడ్ టేస్ట్ మీమ్స్'ను తమ 'టాప్ టర్న్ ఆఫ్'గా ఎంచుకున్నారు.

గతం సంగతి ఎలా ఉన్నా భవిష్యత్ కార్యాచరణకు సంబంధించి నిర్ణయాత్మక నిర్ణయాలు తీసుకోవడంలో యువతరం ముందు ఉంటుంది. అభిరుచుల నుంచి కెరీర్ ఆప్షన్స్ వరకు కొత్తగా ఆలోచిస్తోంది.

'కాలేజీ చదువు పూర్తయిన తరువాత వైట్–కాలర్ జాబ్ తెచ్చుకోవాలి' అనేది సంప్రదాయ ఆలోచన. అయితే యువతరంలో అందరూ ఇలాగే ఆలోచించడం లేదు. 'కంఫర్టబుల్ లైఫ్‌స్టైల్'కు మాత్రమే ప్రాధాన్యత ఇవ్వడం లేదు. దీనికి కారణం జెనరేటివ్ ఏఐ. జెనరేటివ్ ఏఐ ప్రభావంతో వైట్–కాలర్ జాబ్స్‌కు ఉద్యోగభద్రత తక్కువ అనే అభిప్రాయం ఉంది. పియర్సన్ రిపోర్ట్ ప్రకారం జెనరేటివ్ ఏఐ వల్ల వైట్–కాలర్ ఉద్యోగాలలో 30 శాతం రిప్లేస్‌మెంట్ జరుగుతుంది.

వైట్–కాలర్ జాబ్‌లతో పోల్చితే బ్లూ–కాలర్ జాబ్‌లకు అధిక ఉద్యోగ భద్రత ఉంది. రోబోట్స్ చేయలేని పనులు వీటిలో ఉండడమే కారణం. ఈ పనులు చేయడానికి ప్రత్యేక శిక్షణ, నైపుణ్యం అవసరం. అయితే జెన్ జెడ్‌లో ఎక్కువమంది ఈ హై–డిమాండ్ ఫీల్డ్‌పై ఆసక్తి ప్రదర్శించడం లేదు.

వైట్–కాలర్ జాబ్, బ్లూ–కాలర్ జాబ్ అనేదానితో సంబంధం లేకుండా ప్రతి ఉద్యోగికి విశ్లేషణాత్మక ఆలోచన విధానం, సమస్య పరిష్కార నైపుణ్యం, సమర్థవంతమైన కమ్యూనికేషన్, స్ట్రెస్ మెనేజ్‌మెంట్ స్కిల్స్... మొదలైన వాటికి సంబంధించి ప్రొఫెషనల్ స్కిల్స్ అవసరం. వీటిపై జెన్ జెడ్ ఆసక్తి ప్రదర్శిస్తోంది.

నిర్ణయాలు తీసుకోవడంలో 'లైఫ్‌స్టైల్' అనేది కీలకపాత్ర పోషిస్తోంది. డబ్బు నుంచి ఫ్రీ టైమ్ అండ్ ఫ్లెక్సిబిలిటీ వరకు ఎన్నో విషయాలను దృష్టిలో పెట్టుకుంటుంది జెన్ జెడ్.